ప్రజా గళమే
# స్పందన
SPANDHA NEWS
జాతీయ తెలుగు దినపత్రిక
Praja Galame Spanda సత్యానికి స్వరం APMUL/26/A3106

బుధవారం ||30-9-2026 ||సంపుటి: 1 ||సంచిక: 57 ||పేజీలు: 8 ||వెల : రూ.5/-   Circulated From : Guntur, Vijayawada, Visakhapatnam, Prakasham, Nellore, Thirupathi, Hyderabad, Rangareddy, Medak, Karimnagar, Warangal



## ఆమె డెడికేషన్‌కు త్రివిక్రమ్ ఫిదా!

విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. తాజాగా విడుదలైన 'నారాయణమ్మ' పాటలో నటి డింపుల్ హయతి డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా.. ఈ పాట కోసం ఆమె చూపిన అంకితభావంపై దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

8






## సీఐఎస్ఎఫ్ సిబ్బందిపై హెడ్ కానిస్టేబుల్ కాల్పులు

జమ్మూకశ్మీర్‌లోని కథువాలో విషాదం.. ఏకే-47తో విచక్షణారహితంగా హల్‌చల్ కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు మృతి

2

## మయన్మార్‌లో మరణ మృదంగం!



- యుద్ధ విమానంతో రెండు బాంబులు జారవిడిచిన సైన్యం
- 49 మంది మృతి చెందినట్లు ధ్రువీకరించిన అరకాన్ ఆర్మీబెంచ్

3

## కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టులో ఎదురుదెబ్బ



- ప్రధాని మోదీ డిగ్రీ కేసు
- సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్

4



## టెక్నాలజీతో పాలనా విధానాలు మారాలి

### కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి నెంబర్ వన్ ర్యాంక్

- విజయవాడలో మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సు
- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం
- ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినా ఆఫీసుల చుట్టూ తిరగడం మారాలి
- డిజిటలైజేషన్ పేరుతో పాత విధానాలనే కొనసాగించవద్దు

02

# అభివృద్ధికి అడ్డొస్తే ఉపేక్షించం

### వాళ్లది రక్తాభిషేకం.. మాది పట్టాభిషేకం!



- ప్రధాని మోదీ అండ, పవన్ హుషారుతో రాష్ట్రాభివృద్ధి
- సంక్షేమానికి, సంక్షోభానికి వ్యత్యాసం గమనించండి
- స్థానిక ఎన్నికల్లోనూ కూటమిదే హవా
- సీఎం చంద్రబాబు

వివరాలు 2లో..

కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే.. కొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాడు కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లే దిక్కులేని పల్లెలను, నేడు పల్లె పండుగ కార్యక్రమంతో ప్రగతి పథంలో నడిపిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు, తన అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హుషారు కలగలిపి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నామని వివరించారు. ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో మాట్లాడిన ఆయన.. గత పాలకుల నేరమయ రాజకీయాలకు, నేటి సంక్షేమ పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని పిలుపునిచ్చారు.

– ఉదయగిరి, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్)



## అప్పుడు చెబితే నమ్మలేదు

### సీడబ్ల్యూసీ భేటీలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు!

- ఓట్ల చోరీ, ఈవీఎంల అంశంపై కాంగ్రెస్ అగ్రనేత ఆవేదన
- వీధి పోరాటాలు, పార్లమెంట్ ద్వారా పోరాటాన్ని ఉధృతం చేయాలని శ్రేణులకు పిలుపు

4

## అభివృద్ధిలో అంతరాలుండొద్దు



- అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి
- ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ స్పష్టం

4

## శ్రీవారి సేవలో లోకేష్



### సింగపూర్ హోంమంత్రితో కలిసి స్వామివారి దర్శనం

- తిరుమలలో కే. షణ్ముగంకు ఘన స్వాగతం
- రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం
- తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు

3

# బ్రేక్ దర్శనాలు రద్దు

### తిరుమలలో పెరుగుతున్న రద్దీ ▪ సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేందుకే నిర్ణయం

పెరటాసి మాసంతో పాటు వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు అక్టోబర్ 1, 5 తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన తేదీలకు సంబంధించి ముందు రోజు అనగా సెప్టెంబర్ 30, అక్టోబర్ 4 తేదీల్లో సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది.

3





## రూ.35కే కేజీ ఉల్లి!

- విజయవాడ రైతు బజార్లలో సబ్సిడీ విక్రయాలు ప్రారంభం
- ఆధార్, రేషన్ కార్డుపై నెలకు కుటుంబానికి 2 కేజీలు
- ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చర్యలు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడి

3



## ఏపీలో కొత్త రైలుకు పచ్చజెండా!

### మచిలీపట్నం-కర్నూలు మధ్య నూతన సర్వీస్

- విజయవాడ మీదుగా రైలు నడిపేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తికి ఆమోదం

2

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026



# అక్టోబర్ 2న ‘స్వచ్ఛథాన్-2026‘

**పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కోసం మ్యారథాన్**

**గాంధీ జయంతి రోజున విజయవాడ-అమరావతిలో నిర్వహణ**

**టీ-షర్ట్‌ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు**

**విజయవాడ (స్పంద న్యూస్):** ప్రజలలో పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం కోసం అక్టోబరు 2న స్వచ్ఛ దివస్ (గాంధీ జయంతి) సందర్భంగా విజయవాడ-అమరావతి ప్రాంతంలో ‘హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్వచ్ఛథాన్ - 2026’ అనే మ్యారథాన్‌ను నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఫార్చ్యూన్ మురళీ పార్కులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్, అమరావతి రన్నర్స్ సహకారంతో ఈ మ్యారథాన్‌ను నిర్వహిస్తున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ టైటిల్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తోందని తెలిపారు. స్వచ్ఛథాన్‌ను 3 కేటగిరీలలో (5కే, 10కే, 21కే హాఫ్ మ్యారథాన్) నిర్వహిస్తున్నట్లు పట్టాభిరామ్ వివరించారు. దాదాపు 13 రాష్ట్రాల నుంచి 10,000 మందికి పైగా రన్నర్లు, విద్యార్థులు, పోలీసులు, వివిధ రంగాల వారు పాల్గొంటారని చెప్పారు. 10కే, 21కే రన్నర్లకు టైమింగ్ బిబ్స్ కేటాయించి, వారి సమయాన్ని రికార్డ్ చేస్తామన్నారు. గెలుపొందిన వారికి రూ. 10 లక్షల ప్రైజ్ మనీ ఉంటుందని చెప్పారు. మెడ్‌స్టార్ హెల్త్ పార్ట్‌నర్‌గా వైద్య సదుపాయాలు చూసుకుంటుందని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న వారికి టీ-షర్ట్, కిట్స్ పంపిణీ చేస్తారని, రిజిస్ట్రేషన్ లేని వారు కూడా 5కే రన్‌లో పాల్గొనవచ్చన్నారు. “స్వర్ణాంధ్ర ఉస్వచ్ఛాంధ్ర” సంకల్పానికి అనుగుణంగా దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దసరా ఉత్సవాలకు విజయవాడ నగరం సిద్ధమవుతున్న నేపథ్యంలో “స్వచ్ఛథాన్” మారథాన్ దసరా ఉత్సవాలకు కర్టెన్ రైజర్‌గా నిలవనుందని పేర్కొన్నారు. అంతకుముందు ఉదయం విజయవాడ అంబేద్కర్ కళావేదిక వద్ద స్వచ్ఛథాన్ టీ-షర్ట్స్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి రన్నర్స్ అధ్యక్షుడు రమేష్ రావి, హెచ్.డి.ఎఫ్.సీ బ్యాంకు ఏపీ ఇన్‌చార్జి(ఆపరేషన్స్) పవన్ తదితరులు పాల్గొన్నారు. మీడియా సమావేశంలో పవన్, జోనల్ హెడ్ రోహిణీ కుమార్, మెడ్ స్టార్ హాస్పటల్స్ పీఆర్‌ఓ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రైలుకు పచ్చజెండా!

**మచిలీపట్నం-కర్నూలు మధ్య నూతన సర్వీస్**

**విజయవాడ మీదుగా రైలు నడిపేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**మంత్రి టీజీ భరత్ విజ్ఞప్తికి అశ్విని వైష్ణవ్ ఆమోదం**

**ప్రయాణికులకు మెరుగైన రవాణా వెసులుబాటు**

**కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి**



**కర్నూలు (స్పంద న్యూస్):** కర్నూలు నగర ప్రజల రైలు ప్రయాణ సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కీలక ముందడుగు పడింది. కర్నూలు సిటీ-విజయవాడ మధ్య కొత్త రైలు సర్వీస్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మచిలీపట్నం-కర్నూలు సిటీ మధ్య విజయవాడ మీదుగా సరికొత్త రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్.. మంత్రి టీజీ భరత్‌కు అధికారికంగా లేఖ రాశారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని కొత్త రైలు సర్వీసును మంజూరు చేయడంపై టీజీ భరత్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**మెరుగుపడనున్న రవాణా సౌకర్యాలు..**

ఈ కొత్త రైలు సర్వీసు ద్వారా కర్నూలు ప్రజలకు సుదూర ప్రయాణాలు ఎంతో సులభతరం కానున్నాయి. ముఖ్యంగా విజయవాడ, మచిలీపట్నం నగరాలతో కర్నూలుకు నేరుగా రైలు అనుసంధానం ఏర్పడుతుంది. వ్యాపార, వాణిజ్య, ఉద్యోగ రీత్యా ప్రయాణించే వారికి ఈ రైలు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల అవసరాలకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం సహకరిస్తోందని టీజీ భరత్ కొనియాడారు.

# అభివృద్ధికి అడ్డొస్తే ఉపేక్షించం!

**ఉదయగిరి (స్పంద న్యూస్):** కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాభిషేకం చేస్తుంటే.. కొందరు విధ్వంసంతో రక్తాభిషేకం చేస్తామంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. నాటి విధ్వంసానికి, నేటి వికాసానికి.. నాటి సంక్షోభానికి, నేటి సంక్షేమానికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాలను నేరమయం చేసేవారెవరో, ప్రజల జీవితాలను మార్చేవారెవరో తెలుసుకోవాలన్నారు. అభివృద్ధికి అడ్డొస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. పల్లె పండుగ-3.0 కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి నియోజకవర్గం రామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఓటమి చెందిన తర్వాత కూడా వైసీపీ చేస్తున్న విధ్వంసాన్ని, కుట్రలను ఆయన వివరించారు. గత ప్రభుత్వంలో పల్లెలు కన్నీళ్లు పెట్టుకున్నాయని, ఎక్కడ చూసినా గుంతలు, వీధి దీపాల కొరత ఉండేదని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ వేసేందుకు కూడా నిధులు లేని ఆ దుస్థితి నుంచి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పల్లెలను అభివృద్ధి బాట పట్టించారని చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేస్తే.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించి చరిత్ర సృష్టించిందన్నారు.

**వెంటిలేటర్‌పై ఉన్న ఏపీని ఆదుకున్న మోదీ**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు ఆపలేదని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ప్రధాని మోదీ ఆదుకున్నారని, ఆయన సహకారం, తన అనుభవం, పవన్ కళ్యాణ్ హుషారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గతంలో పారిశ్రామికవేత్తలను తరిమేసిన పరిస్థితి నుంచి, నేడు పరిశ్రమలు రాష్ట్రాన్ని వెతుక్కుంటూ వచ్చే స్థాయికి ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని చంద్రబాబు ధ్వజమెత్తారు. రూ. 4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. వెలిగొండ ఫేజ్-2 ను కూడా పూర్తి చేసి ఉదయగిరికి నీళ్లు అందిస్తామని, మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల కంటే ఇప్పుడు ఎన్డీఏ హవా మరింత పెరిగిందని, స్థానిక ఎన్నికల్లోనూ కూటమిని గెలిపించేందుకు



ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడున్నది నరేంద్ర మోదీ, సీబీఎన్, పవన్ కళ్యాణ్ అనే విషయాన్ని అడ్డుకునే ప్రయత్నం చేసేవారు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

# శ్రమదానంతో శ్రీకారం!

- **కొకులవారిపల్లిలో పల్లె పండుగ పనులు ప్రారంభించిన సీఎం, డిప్యూటీ సీఎం**
- **కొత్త డొంక రోడ్డు నిర్మాణానికి గడ్డపారలు చేతపట్టిన ముగ్గురు నేతలు**



**ఉదయగిరి (స్పంద న్యూస్):** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ గడ్డపారలు చేతపట్టి కొత్త డొంక రోడ్డుకు శ్రీకారం చుట్టారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం కొకులవారిపల్లి గ్రామంలో పొలాల మధ్య నిర్మించతలపెట్టిన డొంక రోడ్డు పనుల్లో వీరు శ్రమదానం చేశారు. గడ్డపారలతో ఈ ముగ్గురు నేతలు మట్టిని తవ్వగా, ఆ గ్రామానికి చెందిన శ్రామికులు గంపలతో మట్టిని ఎత్తి రోడ్డు పోశారు. పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం డొంక రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. పైలట్ ప్రాజెక్టు కింద గ్రామీణ ప్రాంతాలు ఉన్న 167 నియోజకవర్గాల పరిధిలో నియోజకవర్గానికి ఒక్కటి చొప్పున డొంక రోడ్డు నిర్మించనున్నారు. అందులో భాగంగా కొకులవారిపల్లిలో డొంక రోడ్డు పనులను శ్రమదానం ద్వారా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముగ్గురు నేతలు కాలినడకన పరిశీలించారు. గ్రామ సరిహద్దుల్లో పశువుల దాహార్తి తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టెను, గ్రామంలో వేసిన బీటీ రోడ్డు, సీసీ రోడ్డు, మినీ గోకులాన్ని పరిశీలించి, నాణ్యతను తనిఖీ చేశారు. సుమారు కిలోమీటరు మేర కాలినడకన కొకులవారిపల్లి గ్రామ సచివాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ శ్రామికులతో కలసి గ్రూప్ ఫొటో దిగారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పీవీఎన్ మాధవ్‌లకు కొకులవారిపల్లికి చెందిన మహిళలు గ్రామ సరిహద్దుల నుంచి పూల జల్లులతో ఘన స్వాగతం పలికారు. మహిళలతో ముచ్చటిస్తూ, వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముగ్గురు నేతలు గ్రామంలోకి నడిచి వెళ్లారు.

# మేం పెత్తందార్లం కాదు.. సేవకులం!

**ఉదయగిరి (స్పంద న్యూస్):** ప్రజలకు సేవ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, తాము ప్రజలకు సేవకులమే తప్ప పెత్తందార్లం కాదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో నిర్వహించిన పల్లె పండుగ-3.0 లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొని రూ. 11,085 కోట్ల విలువైన గ్రామీణాభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామాభివృద్ధిలో పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేశారని, ఆయన నాయకత్వంలో మూడు పల్లె పండుగ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని సీఎం ప్రశంసించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రెండేళ్లలో జెట్ స్పీడ్‌తో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. పల్లె పండుగ-3.0 లో భాగంగా రూ. 2,700 కోట్లతో సీసీ రోడ్లు, రూ. 7,550 కోట్లతో బీటీ రోడ్లు, రూ. 300 కోట్లతో మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పట్టణ ప్రాంతాల్లో రూ. 50 వేల కోట్లతో పనులు ప్రారంభించామని, పల్లెల్లోనూ కనివినీ రీతిలో అభివృద్ధి చేస్తున్నామని సీఎం వెల్లడించారు.

**నిధుల వరద..**

2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వృథా కాలేదని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటున్నామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. వెలిగొండ ఫేజ్-2 పూర్తి చేసి మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ సభలో ఆయన పలు కీలక ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డిపల్లె రిజర్వాయర్‌కు రూ. 52 కోట్లు, సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 కు రూ. 85 కోట్లు, కనిగిరిలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీటి కోసం రూ. 100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సభ అనంతరం కాకొల్లువారిపల్లిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పొలాల మధ్య గడ్డపారలు పట్టి రోడ్డు నిర్మాణంలో శ్రమదానం చేశారు. అభివృద్ధి పనులను కాలినడకన పరిశీలించి శ్రామికులతో కాసేపు ముచ్చటించారు.

# టెక్నాలజీతో పాలనా విధానాలు మారాలి

**విజయవాడలో మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సు**

**చంద్రబాబు చేతుల మీదుగా అవార్డుల ప్రదానం**

**విజయవాడ (స్పంద న్యూస్):** దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్‌లో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల-2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సదస్సుకు ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణా సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు.

**కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి మొదటి స్థానం..**

ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్, ఏపీఎస్టీటీఏ డైరెక్టర్ వీఆర్ నలపరి అదుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఏపీలో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అయితే కేవలం కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను విధుల్లో ఎంతవరకు అమలు చేస్తున్నారు, ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.




**టెక్నాలజీ మారింది.. పాలనా విధానాలు మారాలి..**

భారత్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్నా, కొన్నిచోట్ల పాత నిబంధనలు, విధానాలు కొనసాగుతున్నాయని సీఎం అన్నారు. కంప్యూటర్లు వచ్చినా అనవసరమైన పేపర్‌వర్క్ కొనసాగడం, దరఖాస్తులను డిజిటల్ చేసినా అనేక అనుమతులు అవసరం కావడం, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకొచ్చినా ప్రజలను కార్యాలయాలకు రప్పించడం వంటి విధానాలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐని కేవలం సాంకేతిక సాధనంగా కాకుండా పాలనలో నిర్ణయాలు, సమస్యల గుర్తింపు, ఉద్యోగుల నైపుణ్యాల అంచనా, శిక్షణ అవసరాల గుర్తింపులో వినియోగించుకోవాలని సూచించారు.

**మానవీయత ద్వారానే పాలనకు విలువ..**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పాలనా వ్యవహారాలను గణనీయంగా మార్చగలదని సీఎం అన్నారు. ఉద్యోగుల సామర్థ్య లోపాలను గుర్తించడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా శిక్షణా కోర్సులను సూచించడం, పరిపాలనా నిర్ణయాలను మెరుగుపరచడంలో ఏఐ ఉపయోగపడుతుందని తెలిపారు. విపత్తులు, తుపాన్ల సమయంలో ప్రజలను ఆదుకునేందుకు ఉద్యోగులే ముందుంటారని గుర్తుచేశారు. పండుగలు, విపత్తుల సమయంలో కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజా సేవలో నిమగ్నమయ్యే ఉద్యోగుల సేవలను ఎప్పటికీ విస్మరించలేమని సీఎం వ్యాఖ్యానించారు. ప్రభుత్వ శాఖల మధ్య నిరంతరాయంగా సమాచార పంపిణీ జరగాలని.. సమాచార వ్యవస్థలు పరస్పరం అనుసంధానమై ఉంటే సమస్యలను సంక్షోభంగా మారక ముందే గుర్తించి పరిష్కరించే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు సూచించారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026

# రూ.35కే కేజీ ఉల్లి!

- విజయవాడ రైతు బజార్లలో సబ్సిడీ విక్రయాలు ప్రారంభం
- ఆధార్, రేషన్ కార్డుపై నెలకు కుటుంబానికి 2 కేజీలు
- ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చర్యలు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వెల్లడి



**అమరావతి (స్పంద న్యూస్):** రాష్ట్రంలో ఉల్లిపాయల ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నేటి నుంచి రైతు బజార్ల ద్వారా కేజీ ఉల్లిపాయలను కేవలం రూ.35కే ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తొలి దశలో విజయవాడ నగరంలోని అన్ని రైతు బజార్లలో సబ్సిడీ ధరకు ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభిస్తున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు ఆధారంగా ప్రతి కుటుంబానికి నెలకు 2 కేజీల చొప్పున కేజీ రూ.35 ధరకు అందజేయనున్నారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల వల్ల సామాన్యులపై భారం పడకుండా ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ ఈ ఉపశమన చర్యలు చేపట్టింది. విజయవాడలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే స్పందన, డిమాండ్‌ను బట్టి తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు బజార్లకు విస్తరించనున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగినప్పటికీ సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు కోరారు.

# మయన్మార్‌లో మరణ మృదంగం!

- యుద్ధ విమానంతో రెండు బాంబులు జారవిడిచిన సైన్యం
- పౌరులు, వ్యాపారులే లక్ష్యంగా దాడి
- 49 మంది మృతి చెందినట్లు ధ్రువీకరించిన అరకాన్ ఆర్మీ
- సామాన్యుల మృతిపై సైన్యం మౌనం
- ప్రతీకార దాడులు తప్పవని తిరుగుబాటుదారుల హెచ్చరిక



**నేపిటా (స్పంద న్యూస్):** మయన్మార్ పశ్చిమ రఖైన్ రాష్ట్రంలో తిరుగుబాటు దళాలైన 'అరకాన్ ఆర్మీ' నియంత్రణలో ఉన్న ప్రాంతంపై సైన్యం జరిపిన వైమానిక దాడిలో కనీసం 49 మంది మరణించగా, 58 మంది గాయపడ్డారు. సోమవారం క్యాక్తావ్ టౌన్‌షిప్‌లోని ఓ స్థానిక మార్కెట్ సమీపంలో యుద్ధ విమానం రెండు బాంబులను జారవిడిచింది. మృతుల్లో ఎక్కువ మంది మార్కెట్ వ్యాపారులు, సరుకులు కొనుగోలు చేయడానికి వచ్చిన వినియోగదారులు, రోడ్డుపై నడుస్తున్న సాధారణ ప్రజలే ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారిలో 22 మంది పరిస్థితి విషమంగా ఉందని అరకాన్ ఆర్మీ పేర్కొంది. రఖైన్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్న సీనియర్ అధికారి వై హున్ ఆంగ్ కూడా ఈ మృతుల సంఖ్యను ధ్రువీకరించారు. క్యాక్తావ్ మార్కెట్ రాష్ట్రంలోని ప్రధాన టోకు వ్యాపార కేంద్రాల్లో ఒకటి. ఇది వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులను, వినియోగదారులను ఆకర్షిస్తుంది.

### ప్రతీకారం తీర్చుకుంటాం..

తమ నియంత్రణలో ఉన్న ప్రాంతంలో జరిగిన ఈ సంఘటనను తీవ్రమైన వైమానిక దాడిగా పేర్కొంటూ, దీనికి బాధ్యులైన వారిపై ప్రతీకార చర్యలు తీసుకుంటామని అరకాన్ ఆర్మీ హెచ్చరించింది. దాడి తర్వాత సోషల్ మీడియాలో విడుదలైన ఫొటోలు, వీడియోలలో కొన్ని భవనాలు తగలబడటం, వాహనాలు ధ్వంసం కావడం, సమీపంలోని వంతెనలో కొంత భాగం కూలిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఘటనపై మయన్మార్ సైన్యం ఇంకా స్పందించలేదు. మయన్మార్‌లోని రెండో అతిపెద్ద నగరమైన మాండలేకు పశ్చిమాన సుమారు 340 కిలోమీటర్ల దూరంలో క్యాక్తావ్ ఉంటుంది. ప్రస్తుతం ఈ ప్రాంతం అరకాన్ ఆర్మీ నియంత్రణలో ఉంది.

# ఎన్నికలలో 'మ్యాచ్ ఫిక్సింగ్'

**సిఈసి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించాలి**

**సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయం**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(స్పంద న్యూస్):** ఎన్నికల ప్రక్రియలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ, కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల సంఘంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాన్ని ఆమోదించారు. దేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియను ప్రధాని, ఎన్నికల సంఘం మధ్య జరుగుతున్న 'మ్యాచ్ ఫిక్సింగ్'గా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రధాని, హోంమంత్రి తరఫున ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతున్నారని తీవ్ర ఆరోపణలు గుప్పించింది. సీఈసీని తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిలిపివేయాలని తీర్మానంలో పేర్కొంది. జాబితా నుంచి అన్యాయంగా తొలగించిన 13.30 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో దాదాపు 25 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కేవలం ప్రతిపక్షం మాత్రమే కాదని, అది ఒక 'ప్రతిఘటన' పార్టీ అని స్పష్టం చేశారు. ఓటు హక్కు పునరుద్ధరణ కోసం తాము చేసే పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంతో సమానమని తీర్మానంలో ఉద్ఘాటించారు. ఎన్నికల సంఘం తన స్వతంత్ర ప్రతిపత్తిని తిరిగి పొందే వరకు పార్లమెంటు, న్యాయస్థానాలు, వీధుల్లో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో రెండు రకాల 'మ్యాచ్ ఫిక్సింగ్' జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. ఒకటి ఈవీఎంలకు సంబంధించినదైతే, రెండోది ఓటర్ల జాబితాల్లో ఉద్దేశపూర్వకంగా మార్పులు చేయడమని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికలు పూర్తిగా ఫిక్స్, రిగ్డ్ అయ్యాయని కూడా ఆయన ఆరోపణలు చేశారు. గత కొంతకాలంగా కాంగ్రెస్ ఓట్ చోరీ అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తోంది. హరియాణా, కర్ణాటక, మహారాష్ట్ర ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని పార్టీ ఆరోపిస్తూ వస్తోంది. మొదట్లో ఆ అంశాలపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేసినా, ఇప్పుడు మీడియా, సంపాదకీయాల్లో కూడా ఎన్నికల ప్రక్రియపై చర్చ జరుగుతోందని రాహుల్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల గొంతును పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ భావిస్తోందని రాహుల్ గాంధీ సమావేశంలో చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యాన్ని నమ్మే పార్టీలు ప్రతిఘటన మార్గంలో ముందుకు సాగాల్సిందేనని ఆయన అన్నారు. 1930లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాన్ని కూడా రాహుల్ గుర్తుచేశారు. అప్పట్లో పూర్ణ స్వరాజ్యం కోసం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ ప్రస్తుతం కూడా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు వివరించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు వస్తున్న సర్ కూడా కాంగ్రెస్ ప్రధానంగా ప్రస్తావిస్తున్న అంశాల్లో ఒకటి. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా కోట్లాది పేర్లు ముసాయిదా జాబితాల నుంచి తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, సర్ ప్రక్రియపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరాలు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఈ అభ్యంతరాలు ఓటర్ల పేర్ల చేర్పులు, తొలగింపులు, ఫారం-6, ఓటర్ల డేటా నిర్వహణ వంటి అంశాలకు సంబంధించినవిగా ఆ నివేదిక పేర్కొంది. అయితే ఆ అంశంపై ఎన్నికల సంఘం మరో వివరణ ఇచ్చింది. సర్ తో పాటు ఇతర నిర్ణయాలన్నీ ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఆమోదంతోనే జరిగాయని ఈసీ వర్గాలు స్పష్టం చేశాయి. కమిషనర్ల మధ్య అభిప్రాయాలు, ప్రశ్నలు ఉండటం సాధారణ ప్రక్రియలో భాగమేనని పేర్కొంది. సమావేశంలో కాంగ్రెస్ పలు డిమాండ్లను ముందుకు తెచ్చింది. చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. అంతే కాదు, ఇప్పటి వరకు తొలగించినట్లు ఆరోపిస్తున్న 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని కోరింది. ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్?కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా



చేయాలని కూడా కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా అంశాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు స్పష్టమవుతోంది. రాబోయే రోజుల్లో ఆ అంశంపై పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరైయ్యారు.కాగా సమావేశానికి ముందు, ఢిల్లీలోని పార్టీ కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ లతో కొద్దిసేపు ముచ్చటించారు. సీడబ్ల్యూసీ సమావేశానికి ముందు వారు నిలుచుని ముచ్చటించుకుంటున్నట్లుగా ఉన్న ఫొటోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. ఈ సంభాషణలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, శివకుమార్‌తో పాటు కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. కాగా, సీడబ్ల్యూసీ సమావేశంలో పలు జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించినట్లు రేవంత్ రెడ్డి తన పోస్టులో పేర్కొన్నారు. దేశ భవిష్యత్తుకు సంబంధించిన సామాజిక, ఆర్థిక వ్యూహాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. అదే సమయంలో, భారతీయ జనతా పార్టీ (బీజేపీ), ఎన్నికల సంఘం కలిసి ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తున్నాయన్న ఆరోపణలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు.



# బ్రేక్ దర్శనాలు రద్దు!

**తిరుమలలో పెరుగుతున్న భక్తుల రద్దీ**

**అక్టోబర్ 1, 5 తేదీల్లో బ్రేక్ దర్శనాల రద్దు**

**సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇచ్చేందుకే ఈ నిర్ణయం**

**తిరుమల (స్పంద న్యూస్):** పెరటాసి మాసంతో పాటు వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్య భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు అక్టోబర్ 1, 5 తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. బ్రేక్ దర్శనాలు రద్దు చేసిన తేదీలకు సంబంధించి ముందు రోజు అనగా సెప్టెంబర్ 30, అక్టోబర్ 4 తేదీల్లో సిఫార్సు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం రోజుకు సుమారు 80 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. అయినప్పటికీ ప్రతి రోజూ అదనంగా వస్తున్న 30 వేల మంది భక్తులు మరుసటి రోజు దర్శనం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. దీంతో సామాన్య భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉండే సమయం మరింత పెరుగుతోంది. ఈ కారణంగానే సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇస్తూ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని టీటీడీ ఈ నిర్ణయం తీసుకుంది.

# శ్రీవారి సేవలో లోకేష్!

**సింగపూర్ హోంమంత్రితో కలిసి స్వామివారి దర్శనం**

**తిరుమలలో కే. షణ్ముగంకు ఘన స్వాగతం**

**రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం**

**తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు**



**తిరుమల (స్పంద న్యూస్):** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మంగళవారం ఉదయం సింగపూర్ హోంమంత్రి కే.షణ్ముగంతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనార్థం సోమవారం రాత్రి తిరుమల చేరుకున్న సింగపూర్ హోంమంత్రికి మంత్రి లోకేష్ స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం మంగళవారం ఉదయం పూర్తి గౌరవ మర్యాదలతో షణ్ముగంను ఆలయానికి తోడ్కొని వెళ్లారు. మహాద్వారం వద్దకు చేరుకున్న ఇరువురు నేతలకు టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. అంతకుముందు సోమవారం రాత్రి తిరుపతి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న మంత్రి నారా లోకేష్‌కు స్థానిక టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు.

# అమెరికాలో ఎస్సార్ గ్రూప్ భారీ పెట్టుబడి..

**స్వయంగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 29(స్పంద న్యూస్):** భారతదేశానికి చెందిన ప్రముఖ కంపెనీ ఎస్సార్ గ్రూప్ అమెరికాలో భారీ పెట్టుబడికి సిద్ధమైంది. అమెరికాలో ఏకంగా 18 బిలియన్ డాలర్లపెట్టుబడి పెట్టాలని ప్రణాళిక వేసింది. ఇందులో భాగంగా అయోవా రాష్ట్రంలో 15 బిలియన్ డాలర్ల ( సుమారు రూ.1.4 లక్షల కోట్లు) భారీ వ్యయంతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో రూయా కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తున్న ఎస్సార్ అమెరికన్ అనుబంధ సంస్థ 'మెసాబి మెటాలిక్స్' అయోవాలో నిర్మించే ఈ ప్లాంట్, అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారంగా నిలవనుందని ట్రంప్ అన్నారు. 2030 నాటికి ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్లాంట్, పూర్తయిన తర్వాత ప్రతి ఏటా 10 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయనుంది. ఈ కర్మాగారానికి అవసరమైన ఇనుప ఖనిజాన్ని మిన్నెసోటాలోని కంపెనీ కార్యకలాపాల నుంచి నేరుగా సరఫరా చేస్తారు. దీనివల్ల యునైటెడ్ స్టేట్స్‌లోనే పూర్తిస్థాయి ఉక్కు సరఫరా చైన్ ఏర్పాటవుతుంది. ఉక్కు దిగుమతులపై గతంలో తాను విధించిన 50 శాతం సుంకాల వల్లే అమెరికా ఉక్కు పరిశ్రమ వేగంగా పుంజుకుంటోందని ట్రంప్ అన్నారు. సుంకాలు చెల్లించకూడదనే ఉద్దేశంతోనే కంపెనీలు తమ ప్లాంట్లను నేరుగా అమెరికాలోనే నిర్మిస్తున్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో తయారీ రంగానికి పెద్దపీట వేస్తున్నందుకు, ఈ అవకాశాన్ని కల్పించినందుకు మెసాబి మెటాలిక్స్ ఛైర్మన్ రేవంత్ రూయా ట్రంప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు. మెసాబి మెటాలిక్స్ సీఈఓ జో బ్రోకింగ్ మాట్లాడుతూ..నేషనల్ సెక్యూరిటీ, ఆటోమొబైల్స్, నౌకా నిర్మాణం, మౌలిక సదుపాయాలకు అవసరమైన కీలకమైన ఉక్కు అవసరాలను ఈ ఫ్యాక్టరీ తీరుస్తుందని పేర్కొన్నారు. 1969లో భారతదేశంలో శశి రూయా, రవి రూయా సోదరుల చేత స్థాపించబడిన ఎస్సార్ గ్రూప్.. ఆయిల్, మైనింగ్, టెక్నాలజీ, రిటైల్ రంగాలలో విస్తరించింది. గుజరాత్‌లోని హజీరాలో దేశంలోనే అతిపెద్ద ఉక్కు కర్మాగారాన్ని, వడినార్‌లో రెండో అతిపెద్ద రిఫైనరీని ఈ గ్రూప్ నిర్వహిస్తోంది. అంతేకాకుండా, యూకేలో షెల్ సంస్థకు చెందిన స్టాన్లో రిఫైనరీ కొనుగోలుతో పాటు, సౌదీ అరేబియాలో తక్కువ-కార్బన్ ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేసే ప్రణాళికల్లోనూ ఉంది.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026

## సంపాదకీయం



# పంటలపై ఎల్‌నినో పంజా!

**పసిఫిక్ మహాసముద్రంలో అసాధారణంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

**2026--27 శీతాకాలంలో 'అత్యంత బలమైన' స్థాయిలో ఉండొచ్చని వాతావరణ నమూనాల అంచనా**

**పేరు వింటే ఏదో తుపాను అనిపిస్తుంది.. కానీ ఎల్ నినో తుపాను కాదు. పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే విస్తృత వాతావరణ పరిణామం. వేల కిలోమీటర్ల దూరంలో సముద్రంలో జరిగే ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును ప్రభావితం చేయగలదు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో మరింత బలపడుతుండటంతో వ్యవసాయ రంగంపైనా దాని ప్రభావం ఎలా ఉంటుందన్న చర్చ మొదలైంది.**

కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన అంతర్జాతీయ వాతావరణ-సమాజ పరిశోధనా సంస్థ సెప్టెంబర్ 21న విడుదల చేసిన తాజా అంచనాలు ఎల్ నినో తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. ఆగస్టులో నినో-3.4 సముద్ర ఉపరితల ఉష్ణోగ్రత వ్యత్యాసం ప్లస్ 2.52 డిగ్రీల సెల్సియస్‌గా ఉండగా, సెప్టెంబర్ 16 నాటికి వారపు సూచిక ప్లస్ 3 డిగ్రీలకు చేరింది. పరిశీలించిన 22 వాతావరణ నమూనాలూ 2026 చివరి వరకు ఎల్ నినో మరింత బలంగా కొనసాగే సంకేతాలిస్తున్నాయి. 2026-27 శీతాకాలంలోనూ ఇది 'అత్యంత బలమైన' స్థాయిలో ఉండవచ్చని అంచనా.

### 2027లోనూ ప్రభావం!

ఎల్ నినో ఇప్పటికిప్పుడు తగ్గిపోయే పరిస్థితి కనిపించడం లేదు. తాజా నమూనా ఆధారిత అంచనాల ప్రకారం 2027 ఫిబ్రవరి వరకు ఎల్ నినో కొనసాగే అవకాశం 100 శాతంగా ఉంది. మార్చి-మే కాలానికి 99 శాతం, ఏప్రిల్-జూన్‌కు 90 శాతం, మే-జూలై నాటికి 61 శాతానికి తగ్గుతోంది. అంటే 2027 మధ్య నాటికి పరిస్థితులు క్రమంగా బలహీనపడే అవకాశమున్నా.. అప్పటివరకు దాని ప్రభావం కొనసాగే సూచనలున్నాయి. అయితే ఇవి వాతావరణ నమూనాల ఆధారంగా రూపొందించిన సంభావ్యత అంచనాలే తప్ప ఖచ్చితమైన ఫలితాలు కావు. భారత వాతావరణాన్ని ప్రభావితం చేసే మరో కీలక వ్యవస్థ అయిన హిందూ మహాసముద్ర ద్విధ్రువం కూడా ప్రస్తుతం సానుకూల దశలో ఉంది. సెప్టెంబర్ రెండో వారంలో దీని వారపు సూచిక ప్లస్ 0.65 డిగ్రీలుగా నమోదైనట్లు తాజా వాతావరణ విశ్లేషణ పేర్కొంది. ఎల్ నినోతోపాటు హిందూ మహాసముద్ర పరిస్థితులు, స్థానిక వాతావరణ వ్యవస్థలు కలిసి భారతదేశంలో వర్షపాతం తీరును నిర్ణయిస్తాయి. అందువల్ల ఎల్ నినో ఉందనే ఒక్క కారణంతో దేశమంతటా కచ్చితంగా కరవు వస్తుందని నిర్ధారించడం సరైంది కాదు.

### రైతన్నకు ముందస్తు ప్రణాళికే రక్షణ

ఎల్ నినో ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షపాతం తగ్గడం, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాల పంపిణీ మారడం, ఉష్ణోగ్రతలు పెరగడం వంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుంది. వర్షాధార వ్యవసాయ ప్రాంతాల్లో నేల తేమ తగ్గితే గోధుమ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ముతక ధాన్యాల వంటి రబీ పంటలకు ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. మరోవైపు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, నేలలో అధిక తేమ కూడా పంటలకు సమస్యగా మారవచ్చు. అందుకే ఒకే రకమైన వ్యవసాయ ప్రణాళికకు బదులుగా ప్రాంతాలవారీ వర్షపాతం, నేలలో తేమ, నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేపట్టాల్సిన అవసరం ఉంది. తక్కువ నీటితో సాగయ్యే పంటలు, పంటల వైవిధ్యీకరణ, సూక్ష్మ సాగునీటి పద్ధతులు, నేలలో తేమను కాపాడే చర్యలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఎల్ నినో అంటే వర్షాలే పడవని కాదు.. కానీ వర్షాల తీరు మారే ప్రమాదాన్ని ముందుగానే హెచ్చరించే కీలక వాతావరణ సంకేతం. అందువల్ల రైతులకు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ అంచనాలు, పంటల వారీ సలహాలు అందించడం అత్యంత కీలకం.



# అప్పుడు చెబితే నమ్మలేదు

**సీడబ్ల్యూసీ భేటీలో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు!**

- **ఓట్ల చోరీ, ఈవీఎంల అంశంపై కాంగ్రెస్ అగ్రనేత తీవ్ర ఆవేదన**
- **వీధి పోరాటాలు, పార్లమెంట్ ద్వారా పోరాటాన్ని ఉధృతం చేయాలని శ్రేణులకు పిలుపు**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** గత రెండేళ్లుగా తాను 'ఓట్ల చోరీ' అంశంపై మాట్లాడుతున్నప్పటికీ పార్టీ నేతల నుంచే సరైన స్పందన, మద్దతు లభించలేదని ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కీలక సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు.

సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "గత రెండేళ్లుగా ఎన్నికల్లో జరుగుతున్న ఓట్ల చోరీ, ఈవీఎంల అవకతవకల గురించి నేను హెచ్చరిస్తూనే ఉన్నాను. అయితే ప్రారంభంలో కాంగ్రెస్‌లోని కొందరు సీనియర్ నేతలు కూడా నా మాటలపై నమ్మకం ఉంచలేకపోయారు, కొందరు సందేహించారు. కానీ, ఇవాళ ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలు అందరికీ స్పష్టంగా అర్థమవుతున్నాయి" అని పేర్కొన్నారు. ఇటీవల ఢిల్లీలోని 'బేలా ఎస్టేట్' ప్రాంతంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో జరిగిన అక్రమాలను రాహుల్ గాంధీ తీవ్రంగా ఎండగట్టారు. అక్కడ దశాబ్దాలుగా నివసిస్తున్న 728 మంది పౌరుల్లో ముసాయిదా ఓటర్ల జాబితా నాటికి కేవలం ఒక్కరి పేరు మాత్రమే ఉంచి, మిగిలిన 727 మంది ఓట్లను తొలగించారని మండిపడ్డారు. ఇది కేవలం జాబితాల సవరణ కాదని, పక్కా పథకం ప్రకారం జరుగుతున్న 'ఓటు చోరీ' అని ఆయన ఆరోపించారు. రాబోయే రోజుల్లో ఈ అంశాన్ని పార్టీ పరంగా మరింత తీవ్రంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఈవీఎంల విశ్వసనీయతపై వస్తున్న ప్రశ్నలను, ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న హేయమైన మార్పులను బహిరంగంగా, బలంగా ప్రస్తావించాలని సూచించారు. వీధుల నుంచి పార్లమెంట్ వరకు ఈ 'మ్యాచ్ ఫిక్సింగ్' వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఓ నిరోధక శక్త్యాత్మక పోరాటాన్ని కొనసాగించాలని శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

# సీఐఎస్ఎఫ్ సిబ్బందిపై హెడ్ కానిస్టేబుల్ కాల్పులు

## నలుగురి మృతి

- **జమ్మూకశ్మీర్‌లోని కథువాలో విషాదం..**
- **ఏకే-47తో విచక్షణారహితంగా హల్‌చల్**
- **కాల్పుల్లో అసిస్టెంట్ కమాండెంట్ సహా నలుగురు మృతి**



**కథువా, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)కు చెందిన హెడ్ కానిస్టేబుల్ తన సహచర సిబ్బందిపై ఏకే-47 తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘోర ఘటనలో ఒక అసిస్టెంట్ కమాండెంట్ స్థాయి అధికారితో పాటు మొత్తం నలుగురు సీఐఎస్ఎఫ్ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కథువా జిల్లా పరిధిలోని 'సేవా 2' హైడల్ ప్రాజెక్ట్ రక్షణ బాధ్యతల కోసం సీఐఎస్ఎఫ్ ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అబ్దేష్ కుమార్‌కు, ఇతర సిబ్బందికి మధ్య మంగళవారం అర్ధరాత్రి దాటాక తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మాటమాట పెరగడంతో తీవ్ర ఆవేశానికి లోనైన అబ్దేష్ కుమార్, తన వద్ద ఉన్న ఏకే-47 రైఫిల్‌తో సహచరులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ అకస్మాత్తు దాడిలో అసిస్టెంట్ కమాండెంట్ అంకిత్ కుమార్ పాండే, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) లక్ష్మన్ సింగ్, కానిస్టేబుళ్లు సంజయ్ కుమార్, మహమ్మద్ రఫీలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. క్యాంప్‌లో అర్ధరాత్రి సమయంలో ఒకేసారి తుపాకీ మోతలు మోగడంతో మిగతా సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాల్పులకు తెగబడిన హెడ్ కానిస్టేబుల్ అబ్దేష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సహచరుల మధ్య వివాదానికి గల కారణాలపై సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు.

# అభివృద్ధిలో అంతరాలుండొద్దు

- **అంతరాలు తగ్గించడమే నిజమైన అభివృద్ధి**
- **ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ స్పష్టం**
- **అట్టడుగు వర్గాల ముఖాల్లో చిరునవ్వు కనిపించినప్పుడే దేశ సుభిక్షం**



**యవత్మాల్, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** అభివృద్ధి ఫలాలు సమాజంలో అత్యంత అట్టడుగున ఉన్న వర్గాలకు సైతం అందాలని, వారి ముఖాల్లో చిరునవ్వు కనిపించినప్పుడే దేశం నిజంగా సుభిక్షంగా ఉంటుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని యవత్మాల్‌లో నిర్వహించిన పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి ఉత్సవాల వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి అంటే అందరినీ బలవంతంగా ఒకే స్థాయికి తీసుకురావడం కాదని, సమాజంలోని హెచ్చుతగ్గులను, వివిధ వర్గాల మధ్య ఉన్న అంతరాలను వీలైనంత వరకు తగ్గించడమే అసలైన ప్రగతి అని ఆయన వివరించారు. 'కొంతమందికి మాత్రమే గరిష్ఠ ప్రయోజనం' చేకూరాలనే వాదనను తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని మోహన్ భగవత్ పేర్కొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశించిన ఏకాత్మ మానవతావాదం ప్రకారం సమాజంలో చివరి వ్యక్తి వరకు మేలు జరగాలని ఆకాంక్షించారు. ఏ ప్రభుత్వ నిర్ణయమైనా సమాజంలోని అత్యంత నిరుపేద వ్యక్తి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే తీసుకోవాలన్న మహాత్మా గాంధీ సూత్రాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రతి పౌరుడికి కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలతో పాటు ఉచిత, నాణ్యమైన విద్య, వైద్యం అందించి, వారు గౌరవప్రదమైన జీవితం గడిపేలా చూడటమే నిజమైన అభివృద్ధి అని ఆర్ఎస్ఎస్ అధినేత ఉద్ఘాటించారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ప్రకృతి సిద్ధమైన సేంద్రియ, మిశ్రమ వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, విత్తనాలు మరియు ఎరువుల వినియోగంలో స్వయం సమృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. ప్రగతి పేరిట పర్యావరణాన్ని విధ్వంసం చేయడం శ్రేయస్కరం కాదన్న ఆయన, దేశ అభివృద్ధి బాధ్యత కేవలం ప్రభుత్వాలదే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు భాగస్వామ్యం వహించాలని హితవు పలికారు.

# ప్రధాని మోదీ డిగ్రీ కేసు

**కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ**

**సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్..**



**అహ్మదాబాద్, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హతలు, డిగ్రీ వివరాలకు సంబంధించిన వ్యవహారంలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు గుజరాత్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాని డిగ్రీ వివరాలను వెల్లడించాలని గతంలో సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (సీఐసీ) ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయడంతో పాటు, తనపై రూ. 25,000 జరిమానా విధిస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన అప్పీల్‌ను గుజరాత్ హైకోర్టు డివిజన్ బెంచ్ తీవ్రంగా తోసిపుచ్చింది. ఈ కేసులో కేజ్రీవాల్ తరఫున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. కేజ్రీవాల్ ఎలాంటి అధికారిక ఆర్టీఐ దరఖాస్తు దాఖలు చేయలేదని, కేవలం ఒక లేఖ ఆధారంగా సీఐసీ 'సుమోటో'గా విచారణ చేపట్టి ఆయనను ప్రతివాదిగా చేర్చిందని పేర్కొన్నారు. డిగ్రీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని గుజరాత్ యూనివర్సిటీ చెప్పినందున ఈ ప్రక్రియతో తమకు సంబంధం లేదని, ఉద్దేశపూర్వకంగా కోర్టు సమయాన్ని వృధా చేయలేదని వాదించారు. అయితే, గుజరాత్ యూనివర్సిటీ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ వాదనను తీవ్రంగా ఖండిస్తూ.. విద్యాసంస్థల ప్రతిష్టను దిగజార్చడానికి, రాజకీయ ప్రయోజనాల కోసం ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో ఎలాంటి లోపం లేదని స్పష్టం చేసింది. సమాచార హక్కు చట్టం ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించినదని, వ్యక్తిగత ప్రచారానికి లేదా రాజకీయ వేదికగా మార్చుకోవడానికి కాదని ఉద్ఘాటించింది. 2016లో నాటి గుజరాత్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎం.ఎన్. పటేల్ తెలిపిన వివరాల ప్రకారం, ప్రధాని మోదీ 1983లోనే పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ పూర్తి చేశారని స్పష్టమవుతోందని పేర్కొంది. విచారణ అనంతరం సింగిల్ బెంచ్ విధించిన రూ. 25,000 జరిమానా సరైనదేనని సమర్థిస్తూ, కేజ్రీవాల్ అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు పూర్తిగా కొట్టివేసింది.

ప్రజాగళమే స్పంద జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026

# నాగార్జున యూనివర్సిటీలో రక్తదాన శిబిరం

- 100 మంది విద్యార్థుల రక్తదానం
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం సందర్భంగా బీజేపీ 'సేవా సంకల్ప అభియాన్'
- రక్తదానం అన్నిటికంటే గొప్ప సేవ
- జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు



**గుంటూరు, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల సుదీర్ఘ ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప అభియాన్' కార్యక్రమంలో భాగంగా గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో (ఏఎన్‌యూ) రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తుంగా యశ్వంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాయతి ప్రదీప్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 100 మంది విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవా భావాన్ని పెంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తం అందుబాటులో ఉంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.

### రక్తదానం అత్యంత పవిత్రమైన సేవ

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ.. మానవాళికి చేసే సేవల్లో రక్తదానం అత్యంత గొప్పదని కొనియాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఏడాదికి కనీసం ఒకసారైనా రక్తదానం చేయడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు. యువత ఇలాంటి సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గంగాధర్ ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేసిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రక్త నిల్వలు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదానం చేస్తాయని, యువతలో ఈ అవగాహన పెరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన విద్యార్థులకు బీజేవైఎం నాయకులు పండ్లు, పాలు, చిక్కీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి చల్లా కౌశిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఉపాధ్యక్షులు కొచ్చర్ల శ్రీదుర్గ, చేవూరి ఆనంద్, కార్యదర్శి ఆకాష్, కార్యవర్గ సభ్యుడు సురేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి. సుబ్బారావు, విశ్వవిద్యాలయ కార్యక్రమ కన్వీనర్ వెంకటరమణ, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు బీజేపీ వర్గాలు వెల్లడించాయి.

# మొక్కల సంరక్షణలో చేయూత ఫౌండేషన్

### ఎకో పార్క్‌లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శ్రమదానం




**గుంటూరు, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** గుంటూరు నగరంలోని ఎకో పార్క్‌లో ఇటీవల నాటిన వేయి (1,000) మొక్కలను సంరక్షించే బృహత్తర బాధ్యతను చేయూత ఫౌండేషన్ స్వీకరించింది. హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మరియు టిజెపిఎస్ కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల భాగస్వామ్యంతో శ్రమదానం నిర్వహించి మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. చేయూత ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, సౌత్ కోస్టల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్‌ల ఉమ్మడి నేతృత్వంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా చేయూత ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సగటున ఒక్కో వ్యక్తికి 422 చెట్లు ఉంటే, భారతదేశంలో ఆ సంఖ్య కేవలం 28 మాత్రమే ఉందని గుర్తుచేశారు. కెనడా (8,953 చెట్లు), రష్యా (4,461 చెట్లు), ఆస్ట్రేలియా (3,266 చెట్లు) అగ్రభాగంలో ఉన్నాయని తెలిపారు. ప్రపంచ భూభాగంలో 31 శాతం అడవులు ఉండగా, భారతదేశంలో 25 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 18 శాతం, గుంటూరు జిల్లాలో అత్యంత అల్పంగా కేవలం 7 శాతం మాత్రమే అడవులు ఉన్నాయని వివరించారు. దేశంలో కనీసం 500 కోట్ల చెట్లను పెంచితే తప్ప పర్యావరణ సమతుల్యత సాధ్యం కాదని, గత 80 ఏళ్లలో నాటిన మొక్కల్లో కేవలం 2 శాతం మాత్రమే చెట్లుగా ఎదిగాయని అన్నారు. సౌత్ కోస్టల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ ఎస్. మంజునాథ్ మాట్లాడుతూ ఎకో పార్కులో నాటిన వెయ్యి మొక్కల్లో కేవలం 1 శాతం మాత్రమే చనిపోవడం హర్షణీయమన్నారు. రేమాండ్స్ అధినేత త్రిపురమల్లు అరుణ్ కుమార్ ఉచితంగా సమకూర్చిన వాటర్ ట్యాంకర్ ద్వారా, కోవిడ్ ఫైటర్స్ బృందం మొక్కలకు నిరంతరం నీరు అందిస్తున్నారని వెల్లడించారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు స్వయంగా మొక్కలకు పాదులు చేసి, నిలదొక్కుకోవడానికి కర్రల ఊతమివ్వడంతో పాటు, ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటి తమ పని సంస్కృతిని చాటుకున్నారని కొనియాడారు. విద్యార్థులందరికీ ప్రముఖ వ్యాపారవేత్త వణుకూరి సుబ్బారెడ్డి భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జె.వి. సుధీర్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బొందిలి పవన్ సాయి రామ్ సింగ్, ల్యాబ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ షేక్ ఖాదర్ బాషా, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకుడు షేక్ పఠాన్ అల్లాబక్షు, మానవత అధ్యక్షులు పోలూరి వీరారెడ్డి, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓరుగంటి నారాయణ రెడ్డి, కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలరాజు, ప్రజా గాయకుడు పి.వి. రమణ, పవన్ జోవిత ఫౌండేషన్ పవన్, చేయూత ఫౌండేషన్ ధనుంజయ రెడ్డి, విజయ్, వంక రామశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

### 35 శాతం సబ్సిడీ ప్రకటించిన ప్రభుత్వం

**గుంటూరు, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** రాబోయే రబీ సీజన్‌ను పురస్కరించుకుని గుంటూరు జిల్లా రైతులకు 35 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) ఎం. పద్మావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక అధికారిక ప్రకటన విడుదల చేశారు. పూర్తి పారదర్శకత కోసం 'డీ-కృషి' అప్లికేషన్ ద్వారా మాత్రమే ఈ రాయితీ విత్తనాల పంపిణీ ప్రక్రియను చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని రైతుల అవసరాల కోసం ప్రభుత్వం ప్రాథమికంగా కేటాయించిన విత్తనాల్లో JG-11 రకం శనగలు 6,590 క్వింటాళ్లు, KAK-2 రకం 2,730 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని జేడీఏ వివరించారు. మార్కెట్‌లో క్వింటా శనగ విత్తనాల అసలు ధర రూ.9,000 కాగా, ప్రభుత్వం అందజేసే 35 శాతం (రూ.3,150) సబ్సిడీ మినహాయించి రైతులు క్వింటాకు కేవలం రూ.5,850 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి రైతుకు గరిష్ఠంగా 2 హెక్టార్ల విస్తీర్ణానికి సరిపడా రాయితీ విత్తనాలు లభిస్తాయని, వీటిని 20 కిలోల ప్యాకెట్ల రూపంలో రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేస్తామని పేర్కొన్నారు. విత్తనాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని, నిబంధనల ప్రకారం శనగ విత్తనాలలో తేమ శాతం గరిష్ఠంగా 9 శాతం మించకూడదని, స్వచ్ఛత 98 శాతం మరియు మొలక శాతం కనీసం 85 శాతం ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు. పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు గుంటూరు ఎస్టీఎల్ వ్యవసాయ అధికారి ఝాన్సీ వాణిని ప్రత్యేక 'మానిటరింగ్ ఆఫీసర్'గా నియమించినట్లు వెల్లడించారు. రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు ప్రతిని ఆర్ఎస్‌కే సిబ్బందికి అందజేసి డీ-కృషి యాప్ ద్వారానే విత్తనాలు పొందాలని, కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలని కోరారు.



# దసరా ఉత్సవాల్లో భక్తుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

### ఈవోకు వీహెచ్‌పీ విజ్ఞప్తి

**ఇంద్రకీలాద్రి (విజయవాడ), సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేడుకగా జరగనున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పూర్తిగా భక్తుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా, సౌకర్యవంతంగా నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మరియు ఇంద్రకీలాద్రి పరిరక్షణ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిని (ఈవో) కలిసి భక్తుల సౌకర్యార్థం మరియు ఆలయ పరిరక్షణ కోసం 10 కీలక ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. దసరా నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలకు అమ్మవారి హుండీ కానుకల నుంచి జరిపే నిధుల చెల్లింపులను వెంటనే నిలిపివేయాలని వీహెచ్‌పీ డిమాండ్ చేసింది. ఉత్సవాల నిర్వహణ కోసం ప్రతిపాదించిన రూ.25 కోట్ల ఖర్చుకు సంబంధించిన పూర్తి వివరాలను, అంచనాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలని స్పష్టం చేసింది. అలాగే వీఐపీ దర్శనాలను పూర్తిగా కట్టడి చేసి, గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండే సామాన్య భక్తులకు వేగవంతమైన, సులభమైన దర్శనం కల్పించాలని కోరింది. దేవస్థాన పరిధిలో మరియు ఉత్సవ విధుల్లో ఇతర మతాలకు చెందిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ నియమించకూడదని, గిరి ప్రదక్షిణ మార్గంలోనూ, పర్వత పరిసరాల్లోనూ అన్యమత చిహ్నాలు లేకుండా క్షేత్రాన్ని పరిరక్షించాలని స్పష్టం చేసింది. మరోవైపు ఇంద్రకీలాద్రి అభివృద్ధికి సంబంధించిన 'మాస్టర్ ప్లాన్' కాపీని ప్రజలకు అందుబాటులో ఉంచాలని వీహెచ్‌పీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రకాశం బ్యారేజీ నుంచి అర్జున్ వీధి వరకు గతంలో ఉన్న సుమారు 45 అడుగుల రహదారిని పునరుద్ధరించి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని, కనకదుర్గ నగర్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి భక్తులు రోడ్లపై నడవాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వాహనాల పార్కింగ్, చెప్పులు భద్రపరిచే కేంద్రాలు, సెల్‌ఫోన్ డిపాజిట్ కౌంటర్లను ఉచితంగా నిర్వహించాలని, కుమ్మరిపాలెం నుంచి ఘాట్ రోడ్‌కు రెండో ప్రత్యామ్నాయ రహదారిని నిర్మించి వాహనాల రద్దీని తగ్గించాలని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యాలు, క్షేత్ర పరిరక్షణ మరియు పారదర్శక పరిపాలన లక్ష్యంగా దేవస్థానం అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయా సంస్థల ప్రతినిధులు ఈవోకు విజ్ఞప్తి చేశారు.







# క్యూ ఆర్ కోడ్‌పై అవగాహన

**గుంటూరు, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** పౌర సరఫరాల శాఖ పంపిణీ చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పి.డి.ఎస్) లో క్యూ ఆర్ కోడ్ కీలక పాత్ర వహిస్తుందని జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ అన్నారు. క్యూ ఆర్ కోడ్ అమలు, తదితర అంశాలను ప్రత్తిపాడు ఎంఎల్ఎస్ పాయింట్ తో పాటు పలు చౌక ధరల దుకాణాలలో డిఎస్ఓ మంగళవారం పరిశీలించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో నాలుగు మండలాల డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డీలర్లకు క్యూ ఆర్ కోడ్ విధానంపై అవగాహన కలిగించారు. పిడిఎస్ మరింత పారదర్శకంగా పని చేయుటకు నూతనంగా ప్రవేశపెట్టిన క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ విధానంలో డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను నివృతి చేశారు. చౌక ధరల దుకాణాలలో పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన ఏర్పాట్లు చేయాలి



**గుంటూరు, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణ పనులకు అక్టోబర్ 4వ తేదీన శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా.పెమ్మసాని చంద్ర శేఖర్ పాల్గొననున్నారని చెప్పారు. హెలిపాడ్ ఏర్పాట్లు, రహదారి మరమ్మతులు, వేదిక నిర్మాణం తదితర అంశాలను పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, తెనాలి రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీరమణి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ ఆర్.శ్రీనివాస మూర్తి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, తహసిల్దార్ గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల బుజ్జికి పురస్కారం




**నరసరావుపేట, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** మహాకవి గుర్రం జాషువా 131వ జయంతి సందర్భంగా నరసరావుపేటలోని మహాత్మ జ్యోతిబాపూలే కళ్యాణ మండపంలో ఉషోదయ ఫౌండేషన్, తెలుగు కళా రత్నాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యరంగంలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వైద్య మిత్ర రాష్ట్ర అధ్యక్షులు మాచర్ల బుజ్జికి 'జాషువా సాహితీ ప్రతిభా పురస్కారం' అందజేశారు. సంస్థ అధ్యక్షులు యూవీ రత్నం, కార్యదర్శి ఉషారాణి చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా మాచర్ల బుజ్జి మాట్లాడుతూ జాషువా పేరుతో పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, భవిష్యత్తులో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మంద వెంకట్రావు, కవి కలరామ్, హైకోర్టు న్యాయవాది వంకాయలపాటి రవి, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సీహెచ్ నాగరాజుతో పాటు కవులు, కళాకారులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి

### పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యం

### మిగిలిన పాఠశాలల్లోనూ త్వరలో ఎన్నికలు

### డీఈఓ రామారావు, ఏపీసీ శ్యాం ప్రసాద్

**పల్నాడు జిల్లా, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న మొత్తం 1,556 ప్రభుత్వ పాఠశాలలకు గాను ఇప్పటివరకు 1,534 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) పీవీజే రామారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) పి. శ్యాం ప్రసాద్ సంయుక్తంగా వెల్లడించారు. పాఠశాల నిర్వహణ, విద్యా ప్రమాణాల మెరుగుదల మరియు మౌలిక వసతుల కల్పనలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు స్థానిక సమాజ భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు విద్యార్థుల అవసరాలను గుర్తించి, పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగిందని అధికారులు వివరించారు. దాదాపు అన్ని పాఠశాలల్లో కమిటీల ఏర్పాటు పూర్తవగా, సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల వాయిదా పడిన మిగిలిన 22 పాఠశాలల్లో కూడా త్వరలోనే ఎన్నికలు పూర్తి చేసి ఎస్ఎంసీలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఈఓ పీవీజే రామారావు, ఏపీసీ శ్యాం ప్రసాద్ స్పష్టం చేశారు.

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026



# ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

**పొన్నూరు, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** పొన్నూరు పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల్లో భత్తుల నాగమణి ఛైర్‌పర్సన్‌గా, ఎం. శ్రీలత వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజరు బాబు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పొన్నూరు ఎంఈఓ డి. రాజు సందర్శించి పరిశీలించారు. కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు సి.హెచ్. నాగ శ్రీనివాసరావు, ఎం.వి. గౌతమ్, డి. రమేష్, ఎన్. సుధీర్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు నిర్వహించారు.

# విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన మహాకవి గుర్రం జాషువా



**మంగళగిరి సెప్టెంబర్29(స్పంద న్యూస్)** కుల,మత,వర్ణ,వర్గ,ప్రాంతీయ,భాషా భేదాలకు అతీతంగా, మానవులందరూ సమానమేనంటూ విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన మహాకవి, "పద్మభూషణ్ గుర్రం జాషువా" అంటూ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు అన్నారు.సోమవారం స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో "గుర్రం జాషువా జయంతి" సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి స్వీట్లు పంచుకుంటూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో కేసన మాట్లాడుతూ, ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం పొంది,తన అభ్యుదయ సాహిత్యంతో అన్ని వర్గాల ప్రజలను ఉర్రూతలూగించిన గొప్ప కవి జాషువా అన్నారు. ఇదే రోజున 1895లో వినుకొండ సమీపంలోని చాట్రాగడ్డ పాడు గ్రామంలో గుర్రం వీరయ్య-లింగమ్మ దంపతులకు వారు జన్మించారన్నారు. తండ్రి యాదవ వర్గానికి చెంది పాస్టర్ గా ఉండగా, తల్లి మాదిగ కులానికి చెంది ఉన్నారన్నారు. అప్పట్లో సమాజంలో వేళ్ళునుకున్న కుల వివక్షను-అస్పృశ్యతను ఆయన తీవ్రంగా ఎదుర్కొన్నారని, ఆ చైతన్యం తోనే తన సాహిత్యం ద్వారా అట్టడుగు వర్గాల గొంతుకుగా నిలిచారన్నారు. ఎటువంటి ఉన్నత చదువులు-ఆర్థిక వనరులు లేకపోయినా స్వయంకృషితో గొప్ప పద్యకవిగా ఎదిగారన్నారు. తన కవితల ద్వారా సామాజిక అసమానతులను నిలదీసి, మానవతావాదాన్ని చాటారన్నారు. ఈయన వ్రాసిన గబ్బిలం, పిరదౌసి వంటి ప్రసిద్ధ ఖండ కావ్యాలు సాహిత్యంలో చారిత్రాత్మక స్థానం పొందాయన్నారు. మరో ప్రసిద్ధ పద్య కావ్యం "స్మశాన వాటిక" లోని అనేక పద్యాలను ఆ తరువాత సత్యహరిచంద్ర నాటకంలోని కాటిసీనులో ఉపయోగించారన్నారు. కవి కోకిల, నవయుగ కవిచక్రవర్తి, కళా ప్రపూర్ణ బిరుదులతో పాటు, "పద్మభూషణ్" పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం చే గౌరవించబడ్డారన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా కూడా సేవలు అందించారన్నారు. ఆ మహనీయుని ఆశయాలు,లక్ష్యాల సాధనకు ప్రజలందరూ వారి జయంతి సందర్భంగా ప్రతినబూనాలని శంకరరావు పిలుపునిచ్చారు. ఇంకా ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేక వెంకటేశ్వరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఉపాధ్యక్షులు తిరువీధుల కిరణ్, రాష్ట్ర నాయకులు బొలగాని వెంకట శివరావు గౌడ్, మంగళగిరి పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జొన్నాదుల వెంకటకృష్ణ, మంగళగిరి ప్రసాద్, దానా గౌడ్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# డీమార్ట్ పార్కింగ్‌లో బైక్ మాయం!

**గుంటూరు, సెప్టెంబర్ 29 (స్పంద):** గుంట గ్రౌండ్ ఎదురుగా ఉన్న డీమార్ట్ పార్కింగ్‌లో నిలిపిన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో యజమాని ఆందోళనకు గురయ్యాడు. వాహనం ఏమైందో సిబ్బంది స్పష్టత ఇవ్వడం లేదని బాధితుడు ఆరోపిస్తున్నాడు. ఇదే పార్కింగ్‌లో ఇటీవల ఓ అడ్వకేట్‌తో సిబ్బంది దురుసుగా ప్రవర్తించి దాడి చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే సిబ్బంది మద్యం సేవించి విధులకు వస్తున్నారనే ఆరోపణలపైనా యాజమాన్యం స్పందించాల్సి ఉంది. వాహనాన్ని వెంటనే గుర్తించి తనకు అప్పగించాలని బాధితుడు కోరుతున్నాడు.




# సీఎం పర్యటన నేపథ్యంలో రేపల్లెలో ట్రాఫిక్ మార్గాల్లో స్వల్ప మార్పులు

- అక్టోబర్ 1న ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలన్న బాపట్ల జిల్లా పోలీసులు

**రేపల్లె, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అక్టోబర్ 1న రేపల్లె పట్టణ పరిధిలో వాహనాల రాకపోకల్లో స్వల్ప మార్పులు చేసినట్లు బాపట్ల జిల్లా రేపల్లె సబ్‌డివిజన్ పోలీసులు వెల్లడించారు. సీఎం పర్యటన వేళ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను గమనించి, పోలీసుల సూచనలను పాటిస్తూ సహకరించాలని కోరారు. నగరం, నిజాంపట్నం వైపు నుంచి రేపల్లె మీదుగా జాతీయ రహదారి లేదా మచిలీపట్నం వైపు వెళ్లే సాధారణ వాహనాలు బేతపూడి సెంటర్, బేతపూడి గ్రామం, తురకపాలెం, మోర్లవారిపాలెం మరియు పేటేరు మీదుగా జాతీయ రహదారికి చేరుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. అలాగే పెనుమూడి వైపు నుంచి నగరం, నిజాంపట్నం వైపు ప్రయాణించే భారీ వాహనాలు జాతీయ రహదారి మీదుగా చెరుకుపల్లికి చేరుకుని, అక్కడి నుంచి నగరం మరియు నిజాంపట్నం వైపు వెళ్లాలని సూచించారు. మరోవైపు సీఎం బహిరంగ సభకు వచ్చే వాహనాల కోసం పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయించారు. పెనుమూడి వైపు నుంచి




సభకు వచ్చే వాహనాలు పట్టణంలోని అంకమ్మ చెట్టు, పెద్ద మసీదు, రింగ్ రోడ్, అరటికాయల మార్కెట్, సోనో విజన్, రాజ్యలక్ష్మి థియేటర్ పక్క రోడ్డు మరియు వీరవల్లి కళ్యాణ మండపం పక్క రోడ్డు మీదుగా ఘరువు రోడ్డులోని వాకా వారి వీధి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్కింగ్ చేసుకుని సభా ప్రాంగణానికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే నగరం, నిజాంపట్నం వైపు నుంచి సభకు హాజరయ్యే వాహనాలు బేతపూడి సెంటర్ నుంచి బేతపూడి గ్రామంలోని వెంచర్‌లో వాహనాలను నిలిపివేసి, మార్కెట్ యార్డు మీదుగా సభా ప్రాంగణానికి చేరుకోవాలని పోలీసులు సూచించారు.

# నృసింహుని గాలిగోపుర ముఖద్వార పందిరి దగ్ధం

- బాణాసంచా నిప్పురవ్వలు పడటమే కారణమన్న అగ్నిమాపక శాఖ అధికారులు
- సకాలంలో మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది
- పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్న స్థానికులు

**మంగళగిరి, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** మంగళగిరి పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి గాలి గోపుర ముఖద్వారానికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన పందిరి సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా దేవస్థానం ఎదుట బాణాసంచా కాల్చడంతో వెలువడిన నిప్పురవ్వలు పందిరిపై పడటంతో మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు ప్రాథమికంగా వెల్లడించారు. వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా దేవస్థానం పరిసరాల్లో బాణాసంచా కాల్చిన సమయంలో నిప్పురవ్వలు గాలి గోపుర ముఖద్వారానికి అనుసంధానంగా ఉన్న పందిరిపై పడినట్లు అధికారులు తెలిపారు. దీంతో పందిరి ఒక్కసారిగా మంటలకు గురైంది. పందిరికి మంటలు అంటుకున్న





విషయం గుర్తించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక వాహనంతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు మరింతగా వ్యాపించకుండా వేగంగా చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకొచ్చారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో మంటలు పరిసర ప్రాంతాలకు వ్యాపించకుండా నివారించగలిగారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. దేవస్థానం పరిసరాల్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానికులు, భక్తుల్లో కొంతసేపు ఆందోళన నెలకొంది. అయితే అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బాణాసంచా కాల్చే సమయంలో పరిసరాల్లోని పందిరులు, అలంకరణలు, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాల విషయంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు.

# పల్లె పండుగతో గ్రామీణాభివృద్ధికి సరికొత్త ఊపు

- శ్రీనివాస గిరిజన, కోడెల కాలనీల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాల పెంపు మరియు సమగ్ర గ్రామాభివృద్ధి పనులను వేగవంతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని చేపట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలోని రామపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ మూడో విడత కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం రూ.11,085 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ విడత పనులను ప్రభుత్వం ప్రారంభించనుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సుమారు రూ.5,391 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.5,694 కోట్ల నిధులు కేటాయించగా; వీటికి తోడు నాబార్డ్ (చీూదీూ=ఐ), వీబీ-గ్రామ్ జీ, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ తదితర పథకాల నిధులను అనుసంధానిస్తున్నారు. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.7,550 కోట్లతో 9,500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు, రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. అలాగే పాడి రైతులకు చేయూతగా రూ.300 కోట్లతో 22,000 మినీ గోకులాలు, రూ.225 కోట్లతో 50,000 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తరణ, పారిశుద్ధ్యం






మెరుగుపర్చేందుకు రూ.110 కోట్లతో 1,000 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్లు నిర్మిస్తారు. వీటికి తోడు రూ.200 కోట్ల వ్యయంతో గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండల నిర్మాణ పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. గతంలో 'పల్లె పండుగ-1' కింద రూ.10.44 కోట్లు, 'పల్లె పండుగ-2' కింద రూ.24.83 కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టగా, ప్రస్తుత మూడో విడతలో మరో రూ.10 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఇందులో భాగంగా స్థానిక శ్రీనివాస గిరిజన కాలనీకి రూ.20 లక్షలు, కోడెల శివప్రసాద్ రావు కాలనీకి రూ.20 లక్షలు కలిపి మొత్తం రూ.40 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అత్యవసర మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ పనులను యుద్ధప్రాతిపదికన చేపడతామని పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో పాటు ద్వామా పీడీ సిద్ధలింగమూర్తి, యలమంద సర్పంచ్ యరమాసా ఆంజనేయులు, కడియాల రమేష్, కడియాల తాండవ కృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, రాంగిశెట్టి రామకృష్ణ, మన్నెం షరీఫ్, పంచాయతీరాజ్ ఏఈ, డిఈ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కారులో మంటలు.. తండ్రి మృతి

**పొన్నూరు రోడ్డులో విషాద ఘటన**

**డయాలసిస్ నుంచి ఇంటికి చేరుకునే సమయంలో ప్రమాదం**

**గుంటూరు, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** గుంటూరు నగరంలోని పొన్నూరు రోడ్ సాయిబాబా గుడి సమీపంలో మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కారులో ప్రయాణిస్తున్న 53 ఏళ్ల వ్యక్తి మృతి చెందారు. ఆయన కుమారుడు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికంగా లభించిన సమాచారం ప్రకారం.. సాయిబాబా గుడి సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న తండ్రి, కుమారుడు ప్రతిరోజూ డయాలసిస్ కోసం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుంటారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం డయాలసిస్ అనంతరం కారులో ఇంటికి చేరుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఇంటికి సమీపంలోకి చేరుకున్న సమయంలో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కారు నడుపుతున్న కుమారుడు వెంటనే డోర్ తెరుచుకుని బయటకు వచ్చాడు. కారులో వెనుక సీటులో కూర్చున్న తండ్రి బయటకు వచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన వైపు కారు డోర్ తెరుచుకోకపోవడంతో బయటకు రావడం సాధ్యపడలేదని సమాచారం. ఈలోగా మంటలు వేగంగా వ్యాపించడంతో ఆయన మృతి చెందారు. ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కారులో మంటలు ఎలా చెలరేగాయనే అంశంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు అధికారిక దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అపార్ట్‌మెంట్ సమీపంలోనే ఈ ఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.



ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026

# బాక్సింగ్‌లో భారత్ జోరు..

## ఇద్దరికి ఫైనల్ బెర్త్

- ఇద్దరు క్రీడాకారులకు తుదిపోరు అవకాశాలు
- ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలపై భారత్ కన్నుతుదిపోరుకు చేరిన పర్వీన్ హుడా, అంకుశ్ పంఘల్; నరేందర్‌కు కాంస్యం




**నాగోయా, సెప్టెంబరు 29 :** 2026 ఆసియా క్రీడల్లో భారత బాక్సర్లు సత్తా చాటుతున్నారు. మహిళల 65 కిలోల విభాగంలో పర్వీన్ హుడా, పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ పంఘల్ సెమీఫైనల్స్‌లో అద్భుత విజయాలు సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లారు. దీంతో ఇద్దరూ కనీసం రజత పతకాలను ఖాయం చేసుకున్నారు. మరోవైపు పురుషుల ం90 కిలోల విభాగంలో నరేందర్ బెర్వాల్ సెమీఫైనల్లో ఓటమి పాలై కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. మహిళల 65 కిలోల విభాగంలో పర్వీన్ హుడా చైనాకు చెందిన లీ షును 5-0తో ఓడించి ఫైనల్ బెర్త్ సాధించింది. ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించిన పర్వీన్.. ఏకపక్ష పోరులో విజయం సాధించి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించింది. దీంతో ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. పురుషుల 80 కిలోల విభాగంలో అంకుశ్ పంఘల్ ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ప్రస్తుత 75 కిలోల ప్రపంచ ఛాంపియన్ ఫజ్లిద్దిన్ ఎర్కిన్‌బొయెవ్‌ను 4-1తో ఓడించాడు. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో పురుషుల బాక్సింగ్ ఫైనల్‌కు చేరిన భారత ఆటగాడిగా ఎనిమిదేళ్ల తర్వాత అంకుశ్ నిలిచాడు. పురుషుల ం90 కిలోల విభాగంలో నరేందర్ బెర్వాల్ కజకిస్థాన్‌కు చెందిన ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఐబెక్ ఒరల్‌బేతో జరిగిన సెమీఫైనల్లో ఓటమి పాలయ్యాడు. దీంతో నరేందర్‌కు కాంస్య పతకం దక్కింది. సెమీఫైనల్ చేరడం ద్వారా ముందుగానే పతకం ఖాయం చేసుకున్న నరేందర్.. స్వర్ణ పతక పోరుకు మాత్రం అర్హత సాధించలేకపోయాడు. పర్వీన్ హుడా, అంకుశ్ పంఘల్ విజయాలతో ఆసియా క్రీడల బాక్సింగ్‌లో భారత్‌కు రెండు స్వర్ణ పతకాల అవకాశాలు లభించాయి. వీరిద్దరూ అక్టోబరు 2న జరిగే ఫైనల్స్‌లో బరిలోకి దిగనున్నారు.




## చరణి చరిత్ర.. టీ20 ర్యాంకింగ్స్‌లో సరికొత్త రికార్డు

**దుబాయ్, సెప్టెంబరు 29 :** భారత యువ ఎడమచేతి వాటం స్పిన్నర్ శ్రీ చరణి ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. తాజాగా విడుదలైన ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లోనే అత్యుత్తమంగా 817 రేటింగ్ పాయింట్లకు చేరుకున్న చరణి.. మహిళల టీ20 బౌలింగ్‌లో అత్యధిక రేటింగ్ సాధించిన బౌలర్‌గా నిలిచింది. ఆస్ట్రేలియా బౌలర్ మేగన్ షట్ 2018 నవంబరులో సాధించిన 806 పాయింట్ల రికార్డును ఆమె అధిగమించింది. జపాన్‌లో జరిగిన ఆసియా క్రీడల్లో చరణి అద్భుతంగా రాణించింది. జపాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 4/10తో కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేసింది. అనంతరం శ్రీలంకతో జరిగిన స్వర్ణ పతక పోరులో రెండు వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో భాగమైంది. ఈ ప్రదర్శనతో ఆమె ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మరో భారత స్టార్ దీప్తి శర్మ కూడా సత్తా చాటింది. ఆసియా క్రీడల ఫైనల్లో మూడు వికెట్లు తీసిన ఆమె 754 పాయింట్లతో రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎక్లెస్టోన్ 723 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన కూడా టాప్-5లోకి తిరిగి వచ్చింది. ఆసియా క్రీడల స్వర్ణ పతక మ్యాచ్‌లో శ్రీలంకపై 79 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడటంతో ఆమె ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానం సాధించింది. ఆసియా క్రీడలు, అంతకుముందు ఆసియా కప్‌లోనూ భారత మహిళల జట్టు తరఫున చరణి కీలక ప్రదర్శనలు చేసింది. ఆసియా కప్‌లో 12 వికెట్లు తీసిన ఆమె.. శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 4/20తో అదరగొట్టి భారత్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించింది.

## గుల్వీర్ సింగ్ సంచలనం.. హ్యాట్రిక్ పతకాలతో రికార్డు!

- ఆసియా క్రీడల్లో భారత్‌కు మూడు పతకాలు అందించి రికార్డు సృష్టించిన అథ్లెట్
- పురుషుల 5,000 మీటర్ల పరుగులో కాంస్యం గెలిచిన గుల్వీర్
- గతంలో 1,500, 10,000 మీటర్లలోనూ రజత పతకాలు సొంతం
- ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో మూడు పతకాలు సాధించిన పి.టి. ఉష సరసన చేరిన యోధుడు
- 13:32.75 నిమిషాల టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచి పోడియంపై భారత్ జెండా






ఆసియా క్రీడల వేదికపై భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ చారిత్రాత్మక ప్రదర్శనతో సంచలనం సృష్టించాడు. జపాన్‌లోని నాగోయా వేదికగా సాగుతున్న క్రీడల్లో భాగంగా మంగళవారం జరిగిన పురుషుల 5,000 మీటర్ల పరుగు ఫైనల్లో అతడు కాంస్య పతకాన్ని సాధించి, ఈ ఆసియా క్రీడల ఎడిషన్‌లో తన ఖాతాలో మూడో పతకాన్ని జమ చేసుకున్నాడు. ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో ఏకంగా మూడు పతకాలు సాధించిన అతికొద్ది మంది భారత అథ్లెట్ల సరసన గుల్వీర్ నిలవడమే కాకుండా, తన అద్భుతమైన పరుగుతో విశ్వవేదికపై భారతదేశ కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగురవేశాడు. పోటీ ఆద్యంతం అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన పురుషుల 5,000 మీటర్ల ఫైనల్ రేసులో గుల్వీర్ సింగ్ 13:32.75 నిమిషాల టైమింగ్ నమోదు చేసి మూడో స్థానంలో నిలిచాడు. ప్రారంభం నుంచి వ్యూహాత్మకంగా పరిగెత్తిన అతడు, రేసు చివరి ల్యాప్‌లో అనూహ్యంగా పుంజుకుని ప్రత్యర్థులను దాటుకుంటూ కాంస్య పతకాన్ని ముద్దాడాడు. గుల్వీర్ ఇప్పటికే ఈ క్రీడల్లో 1,500 మీటర్ల విభాగంలోనూ, అలాగే 10,000 మీటర్ల సుదీర్ఘ పరుగు విభాగంలోనూ రజత పతకాలను గెలుచుకున్నాడు. తాజాగా సాధించిన కాంస్యంతో అతడి పతకాల సంఖ్య మూడుకు చేరింది. ఒకే ఆసియా క్రీడల ఎడిషన్‌లో 1,500, 5,000 మరియు 10,000 మీటర్ల తరహా భిన్నమైన, కష్టతరమైన విభాగాల్లో పతకాలు సాధించడం గుల్వీర్ శారీరక దారాఢ్యనికి, నిలకడైన ప్రదర్శనకు నిదర్శనంగా నిలిచింది. గతంలో భారత క్రీడా దిగ్గజం పి.టి. ఉష మాత్రమే ఒకే ఆసియా క్రీడల్లో మూడుకు పైగా పతకాలు సాధించగా, ఇప్పుడు గుల్వీర్ సింగ్ ఆమె సరసన చేరి ప్రత్యేక ఘనతను సొంతం చేసుకున్నాడు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత అథ్లెటిక్స్ స్థాయిని పెంచిన గుల్వీర్ సింగ్ తాజా విజయంపై దేశవ్యాప్తంగా క్రీడాభిమానులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## యశస్వి, వైభవ్.. ఇద్దరి ఎదురుచూపు ఒకటే

**ముంబై, సెప్టెంబరు 29 :** ప్రతిభ, ఫామ్ ఉన్నప్పటికీ భారత జట్టులో తుది ఆటగాళ్ల జాబితాలో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ ఆటగాళ్లలో యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ నిలుస్తున్నారు. ఫార్మాట్లు వేర్వేరైనా.. ఇద్దరూ రాజస్థాన్ రాయల్స్‌కు ఓపెనర్లుగా ఆడుతుండటం, జాతీయ జట్టులో అవకాశం కోసం వేచి చూడాల్సి రావడం ఆసక్తికరంగా మారింది. జట్టులో తీవ్ర పోటీ ఉన్న నేపథ్యంలో అవకాశాలు వచ్చినప్పుడు సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలని కోచింగ్ సిబ్బంది సూచిస్తున్నారు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ముందు భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ యశస్వి పరిస్థితిపై స్పందించాడు. జట్టులో స్థానాల కోసం తీవ్ర పోటీ ఉందని, యశస్వి అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడని పేర్కొన్నాడు. ఇప్పటివరకు అవకాశం లభించిన సందర్భాల్లో అతడు బాగా ఆడాడని, అతడికి ఎలాంటి అన్యాయం జరగడం లేదని స్పష్టం చేశాడు. కష్టపడి పనిచేస్తూ అవకాశం కోసం వేచి ఉండాలని సూచించాడు. యశస్వి గతంలో స్వదేశంలో అఫ్గానిస్థాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఆ తర్వాత ఇంగ్లండ్ పర్యటనకు ఎంపిక కాలేదు. ప్రస్తుతం వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. తుది జట్టులో స్థానం మాత్రం పోటీతో కూడుకున్నదే. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ వంటి ఓపెనర్లు ఉండటంతో యశస్వికి అవకాశాలు పరిమితమవుతున్నాయి. 2027 వన్డే ప్రపంచకప్ నాటికి అతడి పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. టీ20 క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీకి ఇదే తరహా పరిస్థితి ఎదురవుతోంది. అఫ్గానిస్థాన్‌తో స్వదేశీ టీ20 సిరీస్‌కు జట్టులో ఎంపికైనప్పటికీ తుది జట్టులో అవకాశం రాలేదు. అప్పట్లో ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్.. వైభవ్‌కు ఇంకా చాలా సమయం ఉందని, అవకాశం వచ్చినప్పుడు తగినంత సమయం ఇస్తామని చెప్పాడు. ప్రస్తుతం టీ20 జట్టులో సంజు శాంసన్, అభిషేక్ శర్మలకు ప్రాధాన్యం ఉండటంతో వైభవ్ తన వంతు అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఫార్మాట్ వేరైనా యశస్వి, వైభవ్ ఇద్దరి ఎదురుచూపు మాత్రం ఒకేలా కనిపిస్తోంది.




## ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం

### మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో అద్భుత విజయం

ఆసియా క్రీడల అథ్లెటిక్స్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో కిరణ్ పహల్, పూవమ్మ మాచెట్టిరా, ప్రాచి, విద్య రామరాజ్‌లతో కూడిన భారత బృందం 3:29.69 నిమిషాల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. బహ్రెయిన్ రజతం, చైనా కాంస్యం గెలుచుకున్నాయి. పరుగు చివరి దశలో విద్య రామరాజ్ అద్భుత ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపారు. ఈ క్రీడల్లో విద్యకు ఇది మూడో పతకం కావడం విశేషం. మరోవైపు మిక్స్‌డ్ రిలేలో గురిందెర్వీర్ సింగ్, అనిమేష్ కుజూర్, స్నేహ, హరిత బృందం కాంస్యం సాధించగా, మహిళల హైజంప్‌లో పూజ కాంస్య పతకం గెలుచుకుంది.



ప్రజాపక్షమే
స్పందన
జాతీయ తెలుగు దినపత్రిక





# రజినీకాంత్ 'ధర్మన్'లో రామ్ పోతినేని..

## వైరల్ ఫొటోతో క్లారిటీ?

**హైదరాబాద్, సెప్టెంబరు 29 :** సూపర్‌స్టార్ రజినీకాంత్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని అభిమానులను ఆకట్టుకునే వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'ధర్మన్'లో రామ్ పోతినేని కూడా నటిస్తున్నారనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. ఇప్పటివరకు దీనిపై అధికారిక ప్రకటన లేకపోయినా.. తాజాగా హీరోయిన్ రాశీ ఖన్నా పంచుకున్న ఓ ఫొటో ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. 'ధర్మన్' మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను రాశీ ఖన్నా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అందులో రజినీకాంత్, రాశీ ఖన్నాతో పాటు రామ్ పోతినేని కూడా కనిపించారు. అయితే ఆ ఫొటోను కొద్దిసేపటికే తొలగించినట్లు తెలుస్తోంది. అప్పటికే అభిమానులు దాన్ని భద్రపరచి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో వైరల్‌గా మారింది. ఈ ఫొటో బయటకు రావడంతో 'ధర్మన్'లో రామ్ పోతినేని నటిస్తున్నారనే ప్రచారానికి మరింత బలం చేకూరింది. అయితే సినిమాలో ఆయన ఎలాంటి పాత్రలో కనిపించనున్నారనే విషయం మాత్రం తెలియాల్సి ఉంది. అతిథి పాత్రలో కనిపిస్తారా? కథలో కీలకమైన పాత్ర పోషిస్తారా? అనే విషయాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. చిత్రబృందం మాత్రం ఇప్పటివరకు రామ్ పాత్రపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో 'ధర్మన్' తెరకెక్కుతున్నట్లు సమాచారం. రజినీకాంత్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. రాశీ ఖన్నా, సిమ్రన్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రామ్ పోతినేని కూడా సినిమాలో ఉన్నారనే ప్రచారం నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# బిడ్డను వదిలి తొలిసారి ప్రయాణం

## పరిణీతి చోప్రా భావోద్వేగ వ్యాఖ్యలు

ముంబయి, సెప్టెంబరు 29 : తల్లిగా మారిన తర్వాత ఎదురైన అనుభవాల గురించి బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కుమారుడు నీర్‌ను ఇంట్లో వదిలి తొలిసారి పని కోసం ప్రయాణించినప్పుడు తీవ్ర అపరాధ భావనకు గురయ్యానని తెలిపారు. ప్రసవం తర్వాత చాలా నెలల పాటు కుమారుడితోనే ఉన్నానని పరిణీతి చెప్పారు. తొలిసారి బిడ్డకు దూరంగా ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో దాదాపు మూడు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నానని వెల్లడించారు. ఆ ప్రయాణం తనకు సరిగ్గా గుర్తు కూడా లేదని భావోద్వేగంగా తెలిపారు. ఇంట్లో కుటుంబ సభ్యులు బిడ్డను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నప్పటికీ.. 'మీ బాబు ఎక్కడ?' అంటూ సమాజం నుంచి వచ్చే ప్రశ్నలు తల్లులపై మరింత మానసిక ఒత్తిడిని పెంచుతాయని పరిణీతి పేర్కొన్నారు. తల్లి అయిన తర్వాత పని, కుటుంబ బాధ్యతల మధ్య సమతుల్యత సాధించడం అంత సులభం కాదని ఆమె వ్యాఖ్యలు తెలియజేస్తున్నాయి. రాఘవ్ చద్దా, పరిణీతి దంపతులకు 2025 అక్టోబరు 19న కుమారుడు నీర్ జన్మించాడు. తల్లిగా మారిన తర్వాత కొంత విరామం తీసుకున్న పరిణీతి.. ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'షక్: ట్రస్ట్ నో వన్'తో నటనలోకి తిరిగి వస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణలో ఆమె ప్రస్తుతం బిజీగా ఉన్నారు.






# ఆమె డెడికేషన్‌కు త్రివిక్రమ్ ఫిదా!

హైదరాబాద్, సెప్టెంబరు 29 : విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. తాజాగా విడుదలైన 'నారాయణమ్మ' పాటలో నటి డింపుల్ హయతి డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా.. ఈ పాట కోసం ఆమె చూపిన అంకితభావంపై దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'నారాయణమ్మ' జానపద శైలిలో సాగే ఉత్సాహభరితమైన గీతంగా రూపొందింది. ఇందులో డింపుల్ హయతి తన నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాట చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా.. సన్నివేశాలు, నృత్య భంగిమలు పర్ఫెక్ట్‌గా వచ్చే వరకు ఆమె రిహార్సల్స్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. పాట విడుదల కార్యక్రమంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ డింపుల్ హయతి అంకితభావాన్ని ప్రశంసించారు. ఓ నటిగా పాత్రకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఆమె చూపిన కష్టం తెలియజేస్తోందని అభినందించినట్లు సమాచారం. డింపుల్ నృత్యం, తెరపై ఆమె చూపించిన ఉత్సాహాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. డింపుల్ హయతిని కేవలం ప్రత్యేక గీతాల్లో కాకుండా సినిమాల్లోనూ చూడాలని ఉందంటూ త్రివిక్రమ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని పెంచాయి. దీంతో భవిష్యత్తులో తన దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో డింపుల్‌కు అవకాశం దక్కవచ్చనే చర్చ మొదలైంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. వెంకటేశ్ మార్క్ కుటుంబ భావోద్వేగాలు, వినోదం, మాస్ అంశాలతో 'ఆదర్శ కుటుంబం' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి, నివేదా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'నారాయణమ్మ' పాటకు వస్తున్న స్పందనతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది.

# నానితో జోడీగా మీనాక్షి చౌదరి..

నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. విభిన్న కథలను ఎంచుకుంటూ కొత్త దర్శకులతో కలిసి పనిచేస్తున్న ఆయన.. ఇప్పుడు 'ఓజీ' ఫేమ్ దర్శకుడు సుజీత్‌తో ఓ క్రేజీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ చిత్రంలో నానికి జోడీగా మీనాక్షి చౌదరిని ఎంపిక చేసే ఆలోచనలో ఉన్నట్లు సినీ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. మీనాక్షి చౌదరి ఇప్పటికే టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళు తున్నారు. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన ఆమె 'ఇచ్చట వాహనములు నిలుపరాదు'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 'హిట్: ది సెకండ్ కేస్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'గుంటూరు కారం', 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి చిత్రాల్లో నటించి మరింత గుర్తింపు సంపాదించారు. ప్రస్తుతం నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు నాని సరసన నటించే అవకాశం కోసం ఆమెతో చిత్రబృందం సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.



నాని--సుజీత్ సినిమా కథాంశంపై కూడా ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. యూకేలోని ఫుడ్ మాఫియా నేపథ్యంలో డార్క్ హ్యూమర్, యాక్షన్ అంశాల కలయికగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ ప్రపంచానికి సంబంధించిన కథలో నాని ఇప్పటివరకు కనిపించని విభిన్న పాత్రలో కనిపించనున్నారని టాక్. చెఫ్ నేపథ్యంతో పాటు గ్యాంగ్‌స్టర్ లక్షణాలు కలిగిన పాత్రలో నాని కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా కీలక పాత్రలో నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. నాని, సుజీత్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌కు తోడు మీనాక్షి చౌదరి కూడా భాగమైతే సినిమాపై ఆసక్తి మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మీనాక్షి చౌదరి ఎంపిక, పృథ్వీరాజ్ పాత్ర, టైటిల్ తదితర అంశాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను 2027 వేసవిలో విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం.

"This newspaper is published by **JAMMUGANI MOHAN** from D.No. 13-19 Selapadu, Guntur, Andhrapradesh - 522213. on behalf of AK PUBLICATIONS, Editor by **JAMMUGANI MOHAN** and printed by JANAPATI VENKATA RAMESH BABU at D.NO. 5-74A, GANGIREDDY PALEM, BELLAMKONDA, GUNTUR, ANDHRA PRADESH - 522411." **PRGI NO: APMUL/26/A3106**. Email: epaper.spandanews@gmail.com , Cell: **94908 24686**

ప్రజాగళమే
స్పంద
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం, 30 సెప్టెంబర్ 2026

# ఆధునిక సదుపాయాలతో జెడ్పీ కార్యాలయాన్ని తీర్చిదిద్దాలి

- నూతన జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్
- మౌలిక వసతుల కల్పనతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం
- ప్రజలకు సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు



**బాపట్ల, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** బాపట్ల జిల్లా ప్రజా పరిషత్ నూతన కార్యాలయాన్ని ఆధునిక సదుపాయాలతో తీర్చిదిద్ది, ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. నూతన జెడ్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన వివిధ విభాగాల ఏర్పాట్లు, మౌలిక వసతులను పరిశీలించారు. నూతన కార్యాలయంలో వివిధ విభాగాల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కార్యాలయ విభాగాల మధ్య సమన్వయం ఉండేలా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. జెడ్పీ కార్యాలయ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యాలయం చుట్టూ చెత్త పేరుకుపోకుండా నిరంతరం పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా కార్యాలయ పరిసరాల్లో పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉద్యోగులతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలకు కూడా సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా, సులభంగా అందేలా ఉద్యోగులకు అనుకూలమైన పని వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సులభంగా అందించే విధంగా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ప్రజల సమస్యలు, అభ్యర్థనలను సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. నూతన జెడ్పీ కార్యాలయం ప్రభుత్వ సేవలకు మరింత సమర్థవంతమైన కేంద్రంగా నిలిచేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు.

# రేపల్లెలో సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**బాపట్ల, సెప్టెంబర్ 30 (స్పంద న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 1న బాపట్ల జిల్లా రేపల్లె ప్రాంతంలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. పర్యటనకు సంబంధించిన సభా ప్రాంగణం, ప్రజా వేదిక మరియు ఇతర ఏర్పాట్లను బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్‌లతో కలిసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. వేదిక పరిసర ప్రాంతాలు, ప్రజల రాకపోకలు, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా మరియు తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మరోవైపు విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులు పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశించారు. సీఎం కాన్వాయ్ రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ మరియు శాంతిభద్రతల నిర్వహణలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటనను అత్యంత విజయవంతం చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. అన్ని రకాల ఏర్పాట్లను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 1 పర్యటన ముగిసే వరకు రేపల్లె ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్, ఎస్పీ మార్గదర్శకాలు జారీ చేశారు.

# విజయవాడలో భారీ మోసం..

## విశ్రాంత ఇంజినీరు రూ.10కోట్ల టోకరా



**విజయవాడ సెప్టెంబర్ 29 ( స్పంద న్యూస్):** నగరంలో భారీ మోసం వెలుగు చూసింది. పోలీసుల పేరు చెప్పి విశ్రాంత ఇంజినీర్కు ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు నాలుగు విడతల్లో రూ. 10 కోట్లు దోచుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. వారం రోజుల క్రితం విజయవాడ గురునానక్ కాలనీకి చెందిన ఓ విశ్రాంత ఇంజినీర్కు అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్కాల్ వచ్చింది. మీ ఫోన్ నంబరు వివిధ నేరాల్లో తమకు లభించిందని, మీపై కేసులు ఉన్నాయని చెప్పారు. ఆ తర్వాత వీడియోకాల్ చేసి.. డిజిటల్ అరెస్టు చేసినట్టు బెదిరించారు. కేసుల నుంచి బయటపడాలంటే భారీగా డబ్బులు ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో భయపడిపోయిన విశ్రాంత ఇంజినీర్.. సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు చేశారు. కృష్ణలంకలోని కెనరా బ్యాంకు ద్వారా నాలుగు లావాదేవీల్లో .. నిందితులు చెప్పిన బ్యాంకు ఖాతాల్లోకి రూ. 10 కోట్లు డిపాజిట్ చేశారు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు మంగళవారం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు.. సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. బాధితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా నిందితులకు సంబంధించిన రెండు ఖాతాల్లో ఉన్న సుమారు రూ. 7కోట్లు ఫ్రీజ్ చేశారు. విశ్రాంత ఇంజినీరు బ్యాంకులో తనకున్న ఫిక్స్డ్ డిపాజిట్ చేసిన నగదు తీసిమరీ సైబర్ నేరగాళ్లకు చెల్లించినట్టు సమాచారం.

# నాలుగు దశాబ్దాల కలకు సాకారం..

## సొంతింటి కలకు పట్టాభిషేకం

### మంత్రి లోకేష్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన తాడేపల్లి క్రిస్టియన్ పేట ప్రజలు




**తాడేపల్లి సెప్టెంబర్ 29(స్పంద న్యూస్ ):** తాడేపల్లి క్రిస్టియన్ పేట ప్రజల నాలుగు దశాబ్దాల చిరకాల ఆకాంక్ష సాకారమైంది. మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ,విద్యాశాఖల మంత్రి శ్రీ నారా లోకేష్ చొరవతో క్రిస్టియన్ పేట




ప్రజలకు ఇంటి పట్టాలు అందడంతో స్థానికులు ఆనందోత్సాహాలతో సంబరాలు నిర్వహించారు. దశాబ్దాలుగా సొంతింటి పట్టాల కోసం ఎదురుచూస్తున్న తమ కల నెరవేరడంతో క్రిస్టియన్ పేట ప్రజలు మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా తమను వెంటాడుతున్న సొంతింటి సమస్యకు పరిష్కారం చూపి, ఇంటి పట్టాలు అందించిన మంత్రి నారా లోకేష్‌కు, కూటమి ప్రభుత్వానికి క్రిస్టియన్ పేట ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.






# సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా దాసరి రాంబాబు

## బాపట్ల జిల్లా పంచాయతీ అధికారిగా సేవలు.. ఉత్తమ అధికారిగా అవార్డు

**సత్తెనపల్లి సెప్టెంబర్ 29 ( స్పంద న్యూస్ ):** సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా దాసరి రాంబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులు ఉత్తర్వులు విడుదల చేశారు. దాసరి రాంబాబుకు పరిపాలనా రంగంలో విశేష అనుభవం ఉంది. గతంలో ఆయన బాపట్ల జిల్లా పంచాయతీ అధికారిగా విధులు నిర్వహించారు. జిల్లాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల పరిపాలనకు సంబంధించిన అంశాల్లో ఆయన కీలక బాధ్యతలు నిర్వర్తించారు. విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా గతంలో జిల్లా ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, స్థానిక సంస్థల పనితీరు మెరుగుదలకు ఆయన ప్రాధాన్యత ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. తాజాగా సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పట్టణ అభివృద్ధి తదితర అంశాలపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడంతో పాటు పట్టణాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. రాంబాబు నియామకంపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానికులు అభినందనలు తెలిపారు. నూతన కమిషనర్‌గా ఆయన సత్తెనపల్లి పట్టణ అభివృద్ధికి ఎలాంటి ప్రాధాన్యత ఇస్తారనే దానిపై స్థానికుల్లో ఆసక్తి నెలకొంది.

# పల్నాడు జిల్లాలో యధావిధిగా ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ

## కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట సెప్టెంబర్ 29( స్పంద న్యూస్):** బ్యాంక్ ఉద్యోగులు 28,29,30 సమ్మె చేస్తామని చెప్పగా ప్రభుత్వం అక్టోబర్ 1 వ తేదీన ఉదయం డబ్బులు డ్రా చేసి మధ్యాహ్నం నుండి ప్రభుత్వం పంపిణీ చేయమని తెలిపారు.కానీ సమ్మె సఫలీకృతం అయినందున ప్రస్తుతం బ్యాంకులు యధావిధిగా కొనసాగుతున్నాయి.కావున ఈ నెల 30 వ తేదీన సంబంధిత పెన్షన్ ఇచ్చే అధికారులు డ్రా చేసుకొని తదుపరి అక్టోబర్ 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ ఉదయం 7.00 గంటల నుండే ప్రారంభమవుతాయని కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా గారు ఒక ప్రకటనలో తెలిపారు.

# దృష్టిలోపం ప్రతిభకు అడ్డంకి కాదు




**నంబూరు, సెప్టెంబర్ 29 (స్పంద న్యూస్):** నంబూరులోని ఎం.ఎస్.కె. క్రికెట్ మైదానంలో జరిగిన 'అమరావతి ఛాలెంజర్ ట్రోఫీ' అంధుల క్రికెట్ పోటీల్లో దుర్గారావు సారథ్యంలోని ఆంధ్ర ఎల్లో జట్టు విజేతగా నిలిచింది. రవి సారథ్యంలోని ఆంధ్ర రెడ్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎంపికైన 40 మంది క్రీడాకారులు మూడు జట్లుగా పోటీల్లో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి ఎ.కె. రవికృష్ణ, అర్జున అవార్డు గ్రహీత, మాజీ భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. దృష్టిలోపాన్ని అధిగమించి క్రీడల్లో రాణిస్తున్న అంధ క్రీడాకారుల పట్టుదల స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. త్వరలో ఢాకాలో జరగనున్న ఆసియా కప్‌కు సంబంధించిన ప్రాబల్య జాబితాలో ఏపీకి చెందిన దుర్గారావు, వెంకటేష్, రవి, అశోక్ రెడ్డి చోటు దక్కించుకున్నట్లు తెలిపారు. జాతీయ పోటీల కోసం ఏపీ జట్టు ఎంపికను ఈ పోటీల్లో ప్రతిభ ఆధారంగా చేపడతామని నిర్వాహకులు వెల్లడించారు.

# పోలీస్ స్టేషన్ ఆవరణలోనే కారు విడిభాగాలు మాయం!

## కోర్టు రిలీజ్ తర్వాత వాహనం తీసుకెళ్లేందుకు వచ్చిన బాధితులకు షాక్..

## పోలీసుల పర్యవేక్షణపై ప్రశ్నలు

**యడ్లపాడు సెప్టెంబర్ 29 స్పంద న్యూస్ :** పోలీస్ స్టేషన్ ఆవరణలో భద్రపరిచిన సీజ్ చేసిన కారు నుంచి కీలకమైన విడిభాగాలు కనిపించకపోవడం కలకలం రేపుతోంది. ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఓ సజీవ దహనం కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు సీజ్ చేసిన కారుకు ఈ పరిస్థితి ఎదురైనట్లు బాధితులు చెబుతున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా కారును పోలీసులు స్వాధీనం చేసుకుని ఎడ్లపాడు పోలీస్ స్టేషన్ ఆవరణలో భద్రపరిచారు. సెప్టెంబర్ 2న కోర్టు ద్వారా వాహనాన్ని రిలీజ్ చేయించుకుని తీసుకెళ్లేందుకు సంబంధిత వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే కారు పరిస్థితిని చూసి వారు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. కారుకు సంబంధించిన నాలుగు టైర్లు కనిపించకపోవడంతో పాటు, ఇంజిన్‌లోని కొన్ని కీలక విడిభాగాలు కూడా లేవని వారు ఆరోపిస్తున్నారు. పోలీసుల ఆధీనంలో, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో భద్రపరిచిన వాహనానికి ఈ పరిస్థితి ఎలా ఏర్పడిందని బాధితులు ప్రశ్నిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లోనే సీజ్ చేసిన వాహనం విడిభాగాలు మాయమయ్యాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. వాహనం పోలీసుల పర్యవేక్షణలో ఉన్న సమయంలో విడిభాగాలు ఎలా కనిపించకుండా పోయాయో అధికారులు స్పష్టత ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. "పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనానికే రక్షణ లేకపోతే.. సామాన్యుల పరిస్థితి ఏమిటి?" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి, వాహనం విడిభాగాలు ఎలా మాయమయ్యాయో తేల్చాలని వారు కోరుతున్నారు.